

# అపేయము

— యద్దనపూడి సులోచనారాణి

"డియర్ రావ్!

నేను "న్యూయార్క్ ఫైనార్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్". 12వ తారీఖున ఢిల్లీ వచ్చాను. ఆరు వారాల పాటు ఇండియాలో పర్యటించటానికి ప్రభుత్వం నన్ను పంపింది. నా ప్రోగ్రాం ప్రకారం 17వ తారీఖు అంటే యెల్లుండి ఉదయం నేను హైద్రాబాద్ వస్తున్నాను. ప్రభుత్వపు అతిథిగా నేను వస్తున్నప్పటికీ అక్కడున్న కొద్ది రోజులూ నీతో గడపాలనుకుంటున్నాను. నీవు నా ఈ ఉత్తరం చూచిన వెంటనే శెలవు పెట్టు.

రావ్! ఇన్ని సంవత్సరాలకు అనుకోకుండా లభించిన ఈ అవకాశంతో నా కలలు ఫలించాయి. నా సుందర స్వప్నం, నా బంగారు కలల భారతదేశం నేటికి కళ్ళారా చూడగలుగుతున్నాను అనే అనుభూతి సంతోషంతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ప్రియమైన రావ్! నా ఈ సంతోషానికి పరిపూర్తి నువ్వు గూడా నా ప్రక్కన నిలబడి పంచుకున్నప్పుడే.

17 వ తారీఖు ప్లేనులో హైదరాబాదు వచ్చేస్తున్నాను.

ఎప్పుడెప్పుడు నిన్ను చూస్తానా అనే ఆదుర్దాతో ఉన్న....

నీ ప్రియమిత్రుడు,

హేస్టన్"

ఆఫీసు పనిమీద క్యాంపువెళ్ళి ఆ రోజే తిరిగివచ్చి ఆఫీసు టపా చూసుకుంటున్న ప్రసాదరావు ఈ ఉత్తరం చూసి తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. హేస్టన్ ఇండియా వచ్చాడా! ఈ రోజు హైద్రాబాద్ వస్తున్నాడా! అనుకోకుండా కలిగిన సంతోషంతో రావ్ మనసు క్షణ కాలం ఉప్పొంగింది. హేస్టన్! ఎంత ప్రియమైన వ్యక్తి. రెండు సంవత్సరాలపాటు దేశంకాని దేశంలో ప్రాణానికి ప్రాణంగా మసలిన హేస్టన్, హిందూ దేశం అన్నా, ఇండియన్స్ అన్నా విపరీతమైన ప్రేమాభిమానాలు కలిగిన హేస్టన్ వస్తున్నాడు. కాదు వచ్చేస్తున్నాడు. దాదాపు వచ్చేసినట్టే! షర్టుస్లీవ్ తొలగించి గడియారం చూసుకున్నాడు. మరో గంటలో బేగం పేటలో దిగేస్తాడు. సంతోషంతో మనసు ఉరకలు పెడుతున్న ప్రసాద రావుకి చటుక్కున ఏదో గుర్తుకు రావడంతో మొహం వివర్ణమైపోయింది. అంతవరకూ ఎర్రగావున్న మొహం నిముషంలో తెల్లగా పాలిపోయింది. హేస్టన్ వస్తున్నాడా? అతన్ని తను కలుసుకోబోతున్నాడా? ఓ గాడ్! అనుకుంటూ వెనక్కువాలి కుర్చీకి అంటుకుపోయాడు. యేది తనకు దారి? ఎలా ఈ ప్రమాదం నుంచి తను తప్పించుకోవటం. అర్థంగాని అసందిగ్ధ భావం వొకటి అతని మనసులో మెదిలి నరనరంలోనూ పాకి ఒంట్లో ఉన్న రక్తాన్ని మంచులా మార్చేసింది. యాంత్రికంగా అతని కళ్ళు గోడనున్న గడియారం వైపు తిరిగాయి. టైము దగ్గరకు వచ్చేస్తోంది. హేస్టన్ రాక యెరుగనట్టు తను తప్పించుకోవటానికి వీల్లేదు. ఉత్తరం అందలేదంటే..... ఛీ, ఛీ! అదెలా! హేస్టన్‌కిది తెలిస్తే బాధపడతాడు. అతనికి తెలియకుండా తప్పించుకోవాలి. ఎలా ఎలా - ఆలోచనలతో రావు కనుబొమలు ముడిపడ్డాయి. పళ్ళు కసిగా పెదవుల్ని కొరికినాయి. అన్ని రోజులు న్యూయార్కులో అన్ని అవసరాలకు తనని ఆదుకున్న హేస్టన్ని తను చూడకుండా పారిపోలేడు. చూసి తప్పించుకోవాలి. సునిశిత బుద్ధి గల రావు మెదడుకి చటుక్కున ఏదో ఆలోచన స్ఫురించటంతో పెన్ తీసి గబగబా అర్జెంట్ అనే లేబిల్ వేసి టూరు ప్రోగ్రామ్ రాసి టైపిస్టుని పిలిచి టైప్ చెయ్యమని చెప్పాడు. ఫోన్ తీసి నంబర్ డయల్ చేసి భార్య సుశీలని పిలిచి తను ఇంటికి కొంచెం ఆలస్యంగా వస్తానని, మర్నాడు తెల్లవారుజామున క్యాంప్ వెళ్ళిపోవాలని అన్నీ సర్ది వుంచమని చెప్పాడు. ఇంతలో టైపిస్టు టైప్ చేసి తీసుకురాగానే దాని మీద సంతకం చేసి ఇచ్చేశాడు. ఇప్పటికి మళ్ళీ అతని మొహంలో ప్రసన్నత వచ్చింది. పనైపోగానే వెనక కుర్చీకి తగిలించిన కోటు తీసుకొని క్రిందకు వచ్చి కారులో కూర్చుని కారు బేగం పేట వైపు మళ్ళించాడు. అతని మొహంలో హేస్టన్ వస్తున్నాడు అన్న సంతోషం మళ్ళీ కన్పిస్తోంది ఇప్పుడు.

అసలు టైమ్‌కి అయిదు నిమిషాలు ఆలస్యంగా ఢిల్లీ నుంచి ప్లేన్ వచ్చింది. అందులోనుంచి తెల్లగా ఆరడుగులకి పైన ఒకటి రెండు అంగుళాలు యెక్కువే సూచించే పొడుగుతో, మెత్తగా సిల్కులా గోధుమవర్ణంతో మెరుస్తున్న జుట్టుతో, పరిపూర్ణమైన ఆరోగ్యం తొణికిసలాడుతూ చూసేవారి చూపులు ఇట్టే తనవైపు ఆకర్షించుకుంటూ, ఠీవిగా, హుందాగా ప్లేనులోంచి క్రిందికి దిగివచ్చాడు హేస్టన్. తనని ఆదర పూర్వకంగా ఆహ్వానించటానికి వచ్చిన ప్రభుత్వోద్యోగులలో ప్రతి ఒక్కరితో కరచాలనంచేసి రావుని చూస్తూనే రెండు చేతులు జాపి బలంగా కౌగలించుకున్నాడు.

"రావ్!"

"హేస్టన్!" కొంచెం పొట్టిగా బక్కగావున్న రావు బలిష్ఠుడయిన అతని చేతుల్లో పసిపిల్లవాడిలా ఒదిగిపోయాడు.

"ఎలాగైతేనేం ఇండియా వచ్చాను." కొన్ని సంవత్సరాల తర్వాత అనుకోకుండా కలిగిన ఈ పునస్సమాగమానికి హేస్టన్ కనులు తడి అయినాయి.

"హృదయ పూర్వకంగా స్వాగతం ఇస్తున్నాను హేస్టన్!" స్నేహ పూరితమైన స్వరంతో గర్వంగా అన్నాడు రావు. హేస్టన్ కోసం వచ్చిన ప్రభుత్వోద్యోగులు అందరూ కనులు వెడల్పు చేసుకుని సంభ్రమాశ్చర్యాలతో వీళ్ళిద్దరివైపు చూడసాగారు.

ప్రభుత్వం తనకోసం ఏర్పాటుచేసిన గెస్టుహౌస్‌కి వెంట రావుని కూడా తీసుకెళ్ళాడు హేస్టన్. అక్కడ ఒకటి రెండు గంటలకంటె ఎక్కువ ఉండని హేస్టన్ ఒక విధంగా తనే రావుని తొందరచేసి అతని ఇంటికి వచ్చేశాడు.

ప్రసాదరావు స్వయంగా సంపాయించిన దానికంటె మామగారు కట్నం, కానుకల రూపంలో ఇచ్చిన ఆస్తే యెక్కువగా ఉంది. రావు ఇప్పుడుంటున్న ఇల్లు గూడా మామగారు కట్టించి ఇచ్చిందే! దాన్ని పూర్తిగా తనకిష్టమైన పద్ధతుల్లో, అధునాతనపు పోకడతో తీర్చిదిద్దుకున్నాడు. అందంగా, పరిశుభ్రంగా ఉన్న ఈ చిన్న బంగళా చూసి హేస్టన్ ముగ్ధుడయ్యాడు. గుమ్మంలో అడుగు పెడుతూనే ఎదురొచ్చిన పిల్లల్ని రావు హేస్టన్‌కి పరిచయం చేశాడు. వాళ్ళని చూస్తూనే దగ్గరకు లాక్కుని పట్టి పైకెత్తి గాలిలోకి ఎగరేసి పట్టుకుంటూ ప్రక్కకు తిరిగి "రావు! పిల్లలు అచ్చు నీ పోలికే సుమా" అన్నాడు నవ్వుతూ. ప్రసాదరావు మనసు చివుక్కుమంది. ఆ మాటే ఇంకోళ్ళు అంటే అతను మనసారా సంతోషించేవాడు. అసలు పిల్లలు అచ్చు తన పోలికే అయినందుకు అతను గర్విస్తాడుకూడా. కాని ఇప్పుడు హేస్టన్ అలా అనటంలో అర్థంవేరు, అతని చూపు పిల్లలు నీ పోలికేగాని నీ భార్య అంత అందగాళ్ళు కాదు సుమా అన్నట్టున్నాయి. ఆ చూపులు, ఆ మాట ఎందుకు నచ్చలేదో రావు ఒక్కడికే తెలుసు.

ఇద్దరూ మధ్యహాల్లో కూర్చుని పాత విషయాలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ చాలా సేపూ మాట్లాడుకున్నారు. రాక రాక హఠాత్తుగా వచ్చిన హేస్టన్ రాకకీ రావ్ ఆర్భాట పడటం లేదు. నిబ్బరంగా మామూలుగా కూర్చుని మాట్లాడుతున్నాడు. ఆ రాత్రికి హేస్టన్‌కి తనింట్లోనే భోజనం ఏర్పాటు చేయించాడు రావు. ఇల్లంతా తిరిగి ఇంట్లో మనిషిలా చనువుగా మెసలాలని ఉవ్విళ్ళూరుతున్న హేస్టన్‌కి రావ్ తనని ఒక చోటనే కూర్చోబెట్టి మాట్లాడటం నచ్చలేదు.



'నా తొలి కథ యిది. 1962లో ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రచురితం అయ్యింది.'
- యద్దనపూడి సులోచనారాణి

స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చిన హేస్టన్‌కి తన భోజనపు ఏర్పాట్లు బయట రావ్ గదిలో విడిగా జరగటం చూసి ఇంకొంచెం నిరాశ కలిగింది. అతను రావ్ పిల్లల్తోపాటు వాళ్ళ మామూలు పద్ధతిలో వాళ్ళలో ఒకడుగా కూర్చుని సుశీల వడ్డిస్తుండగా భోంచెయ్యాలని ఊహిస్తున్నాడు. అతని ఊహ వ్యతిరేకం అయింది. "భోజనం తీసుకోవటంలో మీ హిందూ పద్ధతి నా కిష్టం" అన్న హేస్టన్ మాటలకి రావ్ నవ్వి ఊరుకున్నాడు. తను వచ్చి ఇన్ని గంటలయినా సుశీలని పిలిచి పరిచయం చెయ్యనేలేదు. ఆవిడంటే తన కెంత అభిమానమో రావ్‌కి తెలియదూ! తనలో వున్న చిత్రకళకి సుశీల ఫొటో ఎంత ప్రాణం పోసిందో అతనికి తెలుసు. న్యూయార్క్ ఫైనార్ట్స్ ఎగ్జిబిషనులో తను లైఫ్ సైజులో పెయింట్ చేసిన సుశీల చిత్రం ఎంతమందిని ఆకర్షించి ఉగ్రూతలూగించిందో తనకి ఎన్ని పొగడ్తలు తెచ్చి పెట్టిందో గూడా స్వయంగా తెలిసిన రావ్ తను వచ్చి ఇన్ని గంటలయినా సుశీలని పిలిచి పరిచయం చెయ్యకపోగా అసలు ఆమె మాటే ఎత్తకపోవటం ఆశ్చర్యంగానే వుంది. హిందూ దేశంలో ఆడవాళ్ళు పరాయి మగవాళ్ళ ఎదురుగుండా రారని రావు చెప్పాడు. అది నిజమే కావచ్చు కాని, ఒక్క క్షణం కన్పించి వెళ్ళిపోవటానికేం? ఆ ఆచారాలకి స్నేహితులనే ప్రత్యేకత లేదుగాబోలు.

పిల్లలు రావుతోబాటు భోంచేస్తుండగా హేస్టన్‌కి రావు మెల్లగా తన క్యాంపు సంగతి చెప్పాడు. హేస్టన్ తెల్లబోతూ "రావ్! నీ కోసం అని ప్రత్యేకంగా నేను ఈ రాష్ట్రంలో ఎక్కువరోజులు కేటాయించుకున్నాను."

"నాకు తెలుసు. వెరీ వెరీ సారీ హేస్టన్! తప్పనిసరిగా వెళ్ళాలి. ఇదంతా నీ ప్రోగ్రామ్ నాకు ముందు తెలియకపోవటం వల్ల వచ్చింది."హేస్టన్ కళ్ళలో కన్పిస్తున్న నిరాశ బల్లెపు పోటులా మనసులో గుచ్చుకోగా రావు ఏదో నెపం మీద అతనివైపు వీపు పెడ్తూ అన్నాడు.

"ఎప్పుడు తిరిగి వస్తావు?"

రావు చెప్పాడు. అది సరిగ్గా హేస్టన్ తిరిగి వెళ్ళేరోజు. హేస్టన్ కెందుకో ఈ కొద్ది గంటల్లోనే రావు వేరని, తనూహించినంత స్నేహంగా అతడు లేడని అన్పించింది. అమెరికాలో ఉండగా ఎంతో దగ్గరగా ఎంతో ప్రాణం ఇస్తున్నట్టు ఉండేవాడు. ఆ రావు వేరు ఈ రావు వేరు అని స్పష్టంగా తెలుస్తోంది. ఉరకలు వేస్తూ పరుగులు తీస్తూ వచ్చిన అతని హృదయం రావు మామూలు మర్యాదలతో ఆగిపోయి చల్లబడిపోయింది.

ఆ రాత్రి పొద్దుపోయిం తర్వాత సుశీలని చూడకుండానే యెన్నో విధాల నిరాశ చెందిన హృదయంతో లేక్‌వ్యూ గెస్టుహౌస్‌కి తిరిగి వచ్చేశాడు హేస్టన్. మర్నాడు కాంప్‌కి వెళ్ళబోయేముందు క్షమార్పణ కోరుకుంటూ ఏమనుకోవద్దనీ - చాలా అవసరం గాబట్టి తప్పనిసరిగా వెళుతున్నానని రావు ఫోన్ చేశాడు. అతని మాటలు - కంఠంలో ఆ బాధ వింటూంటే హేస్టన్‌కి నిజంగా జాలి కలిగింది. తనేమీ అనుకోననీ వెళ్ళి రమ్మనీ చెప్పాడు. అతని ప్రోగ్రాం ప్రకారం కొద్ది సవరణలతో అనుకున్నవి అన్నీ జరిగిపోతున్నాయి. హైద్రాబాద్‌కి చుట్టు ప్రక్కల వున్న స్థలాలు, హైద్రాబాదులో ఉన్నవి అన్నీ చూశాడు. నాలుగో రోజు ఉదయం రోజంతా బయటకెళ్ళే పనిలేదు. తనని ప్రత్యేకంగా కలుసుకోవాలని వచ్చినవాళ్ళతో మాట్లాడుతూ ఉండిపోయాడు. వాతావరణం మార్పు వల్లనో లేక విశ్రాంతి అనేది లేకుండా తిరగటం వల్లనో ఆ రోజంతా బద్ధకంగానే వుంది. అలాగే వచ్చిన అందర్నీ కలుసుకొని ఏ ఒక్కర్నీ తిప్పి పంపకుండా మాట్లాడాడు. సాయంత్రం అయేసరికి ఒళ్ళంతా నొప్పులు అన్పించింది. థర్మామీటర్ తీసుకొని చూస్తే జ్వరం చూపించింది. కొద్దిగా అలిసినట్లుగా అన్పించిన హేస్టన్ అప్పుడే తనకోసం వచ్చిన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌తో మాట్లాడి పంపి వచ్చి గదిలో మంచం మీద కూర్చున్నాడు.

సాయంత్రం అయిపోయింది. శీతాకాలపు బంగారు రంగులో మెరుస్తున్న ఎండని చూస్తుంటే మనసుకి అహ్లాదంగా అన్పిస్తోంది. యెత్తుగా స్కై స్క్రేపర్స్ మధ్య బోలెడంత గందరగోళంలో పెరిగిన హేస్టన్‌కి హిందూదేశం చిన్నచిన్న ఇళ్ళతో, విచిత్రంగా, అసక్తిగా వున్న వాళ్ళ వేషభాషలతో, సుందరంగా, ప్రశాంతంగా కనిపించింది. అతని ఆలోచన్లు మాటిమాటికి, వెళ్ళి చూడని సుశీల మీదనే నిలుస్తున్నాయి. ఏం చేస్తుందీపాటికి. బయటకు రాకుండా ఇరవై నాలుగ్గంటలు ఇంట్లోనే గడిపే హిందూదేశం ఆడవాళ్ళ దినచర్య ఎలా ఉంటుందో తనకు తెలియదు. ఆమెని ముఖాముఖి చూడకపోయినా ఆ అందమైన మొహం తనకెంత పరిచయం. రావు భార్యగా ఆవిడంటే తన కెంతో గౌరవాభిమానాలు. ఆవిడ ఫోటో తనెక్కడికి వెడితే అక్కడికి వెంట డైరీతోపాటు వస్తూందని, ఆ ఫోటో తనకి ప్రాణంతో సమానమని బహుశా ఆవిడకి తెలిసివుండదు. రావు ఆవిడకు చెప్పకుండా ఉంటాడా! ఏమో! రావు ప్రవర్తన గుర్తొచ్చేసరికి హేస్టన్ ఆలోచనలు ఆగిపోయాయి. ఈసారి రావురాగానే అడిగేసెయ్యాలి. ఇంత దగ్గరగా వచ్చికూడా తాను సుశీలని చూడకుండా వెళ్ళిపోలేడు. ఆవిడకు తన భాష రాకపోవచ్చు. తామిద్దరూ మాట్లాడుకో లేకపోవచ్చు. అసలు తనతో మాట్లాడటానికి ఆవిడ ఇష్టపడక పోయినా సరే, ఒక్కసారి ఆ కళ్ళవైపు, ఆ సౌందర్యం వైపు పరీక్షగా చూస్తే చాలు. ఇంతవరకూ ఇది తన ఊహే! ఆ ఊహే ప్రాణంతో సజీవంగా కదులుతుంటే ఎలా ఉంటుందో చూడాలని కళాపూరితమైన అతని మనస్సు మహా కాంక్షిస్తోంది. హేస్టన్ ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ బాయ్ విజిటింగ్ కార్డు ఒకటి తెచ్చి ఇచ్చాడు. ఏదో ఇండియన్ నేమ్. హేస్టన్‌కి నోరు తిరగ లేదు. పేరును బట్టి ఆడో మగో గూడా అర్థం కాలేదు. లేచి బయటకొచ్చాడు.

విజిటర్స్ రూమ్‌లో కుడివైపు ఉన్న సోఫాలో పంచె, లాల్చీతో, బంగారు ఫ్రేమున్న కళ్ళద్దాలతో, నిగనిగలాడుతున్న బట్టలతో పొట్టిగా నల్లగా, లావుగా

ఉన్నాయన హేస్టన్ని చూస్తూనే లేచి నమస్కారం చేశాడు. అతి సామాన్యంగా పల్లెటూరి వాడిలా కన్పిస్తున్న ఈయనకి తనతో పనేమిటో అర్ధంగాలేదు హేస్టన్‌కి, "నేను మీ ప్రసాదరావు మామగార్ని - " కొద్దిగా, యాసగా ఉన్న ఇంగ్లీషులో దగ్గరగా వచ్చి కరచాలనం కోసం చేయి ఇస్తూ అన్నాడాయన.

క్షణం సేపు అర్థంగానట్టు చూసిన హేస్టన్ వెంటనే సంతోషంగా చేయి జాపి "ఈజ్ దట్ సో?" అన్నాడు.

ఇద్దరూ ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. ముసలాయన చెప్పటం ప్రారంభించాడు. ఆయనకి, హేస్టన్‌కీ ముఖాముఖి పరిచయం లేకపోయినా రావు ఉత్తరాలద్వారా బాగానే తెలుసు. రావు అమెరికాలో ఉండగా హేస్టన్ చూపిన ఆదరానికి స్వయంగా కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆయనకి సుశీల ఒక్కత్తే కూతురు. ప్రసాదరావు చెల్లెలి కొడుకు. చెల్లెలి భర్త చచ్చిపోతే చెల్లెల్ని, కొడుకుని దగ్గర పెట్టుకొని ప్రసాదరావుని పెంచి, పెద్దచేసి, సుశీలని ఇచ్చి పెండ్లి చేశాడు. హైద్రాబాదుకి ఈశాన్యంగా నలభై మైళ్ళ దూరంలో వున్న పల్లెటూళ్ళో ఇళ్ళు, పొలాలు, పాడిపంట ఉన్నాయి. హేస్టన్ వచ్చినట్లు తెలియదని, ఈ రోజు ఉదయం తనేదో పనిమీద వస్తే తెలిసిందని తెలియగానే చూడటానికి వచ్చానని చెప్పాడు. హేస్టన్ వస్తే తన ఊరుతీసుకు వెడతానని హిందూ దేశపు ఆచారాలు, ప్రజల జీవన రీతులు చూడాలంటే పల్లెటూళ్ళు చూస్తే అర్థం అవుతుందని చెప్పాడు. ఆదరపూర్వకంగా, అనునయంగా మాట్లాడుతున్న ఆయన మాటలకి హేస్టన్ హృదయం పులకించింది. ఇలాంటి ఆప్యాయతే తను రావు దగ్గర ఆశించింది.

కొద్దిసేపు కూర్చున్న తర్వాత మాటల మీద ఒంట్లో బాగోలేదని తెలియగానే ముసలాయన తనతో ఇంటికి వచ్చెయ్యమని రావు లేకపోయినా అది మీ ఇల్లులాగానే భావించుకోమనీ వంట్లో బాగుండనప్పుడు ఒంటరిగా ఉండవద్దనీ, అంతగా అయితే రాత్రికి వుండి, ఉదయం లేచి వచ్చేయ్యమని చెప్పాడు. తనతో కూడా రమ్మని బలవంతం చేశాడు. ఆదరపూర్వకంగా ఇస్తున్న ఈ ఆహ్వానాన్ని కాదనలేని హేస్టన్ లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చి కారులో ముసలాయన ప్రక్కన కూర్చున్నాడు. అయనింకా ఏవో విషయాలు ఆపకుండా చెపుతూనే ఉన్నాడు. కారు కదిలింది. హఠాత్తుగా అనుకోకుండా సుశీలని చూడవచ్చునేమో అనే ఆశ అతని మనసులో సంతోషం నింపసాగింది.



కారు దిగి ఇద్దరూ లోపలికి వచ్చారు. ఆ హాలు క్రిందటిసారి హేస్టన్ చూసిందే! కంటికి కన్పిస్తున్న ప్రతీ వస్తువు పొందిగ్గా అందంగా అమర్చబడివుంది. అందంగా తీర్చిదిద్దటం గూడా తెలుసుకాబోలు. హేస్టన్ని హాల్లో కూర్చోబెట్టి ముసలాయన ఒకసారి లోపలకు వెళ్లివచ్చాడు. ఆయన చెపుతున్న విషయాలు అర్థం అయినా, కాకపోయినా హేస్టన్ ఆసక్తిగా వింటూనే వున్నాడు. మధ్య మధ్య అతని చూపులు వెళ్ళి గుమ్మానికున్న పరదాని పరిశీలిస్తున్నాయి. ఇది ముసలాయన కనిపెట్టకపోలేదు. ఇంతలో నౌకరు ట్రేతో బిస్కట్లు, పండ్లు, టీ తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు. ముసలాయన ఇస్తున్న టీ తీసుకుంటూ "మీ దేశంలో ఆచారాలు గురించి కొన్ని విన్నాను. రావు చెప్పాడు. స్నేహితుల మనుకున్న వాళ్ళ ఎదుటికీ మీ ఆడవారు రారుటకదూ!" అమాయకంగానే అడిగాడు హేస్టన్.

"పూర్వం అలానే ఉండేది కాని, కాలం మారిపోయింది. మారిపోతున్న కాలంతో మనుష్యులు, వాళ్ళ పద్దతులు మారటం కూడా సహజం. ఇప్పుడు అంత ఆచారాలు మాకులేవు. మా ఆడవారుకూడా ఇప్పుడిప్పుడు బయటికొస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. మీకు తెలిసే ఉంటుంది."

"ఎలాగైనా చాలా తక్కువ" మరోసారి లోపలివైపు చూస్తూ అన్నాడు అతను.

"ఎందుకు, మీరు మా సుశీలని చూడలేదూ?" హఠాత్తుగా యేదో గుర్తువచ్చినట్టు అడిగాడు ముసలాయన.

ఉలిక్కిపడి హేస్టన్ నిదానంగా, నిబ్బరంగా "లేదు. క్రిందటిసారి ఇక్కడికి వచ్చినా ఎక్కువ టైం లేక త్వరగా వెళ్ళిపోయాను. ఇంతలో రావు క్యాంప్ వెళ్ళిపోయాడు. ఫోటో చూశాననుకోండి" తను పెయింట్ చెయ్యటం దానికి మంచి పేరు ప్రఖ్యాతులు రావటం వివరంగా చెప్పబోతున్న హేస్టన్‌ని ముసలాయన మధ్యలోనే ఆపేస్తూ ఆగమని చెప్పి లేచి లోపలికి వెళ్ళి వచ్చాడు. ఆయన తిరిగి వచ్చిన తరువాత హేస్టన్‌కి మాట్లడే అవకాశమే ఇవ్వలేదు. హిందూ దేశపు ఆచారాల్లో ఎంత అర్థం వుందో అవి యెంత మంచివో వాటిని ఈ కాలపువారు ఎలా నాశనం చేస్తున్నారో-చెప్పసాగాడు. అతను శ్రద్ధగా వింటున్నాడు. ఇంతలో పరదా వెనక గాజుల చప్పుడయింది. ఆ శబ్దం ఏమిటో సరిగా అర్థం గాని హేస్టన్ టీ తాగుతూనే అటువైపు చూశాడు.

టీ తాగటం పూర్తి చేసిన ముసలాయన కప్పు టేబిల్ మీద పెడుతూ "రామ్మా! పర్వాలేదు. హేస్టన్ నీకు సోదరుడి లాంటివాడు" అని వెనక్కు తిరిగి పిలిచారు. భాష తెలియకపోయినా కొద్దిగా చూచాయగా భావం అర్థం చేసుకున్న అతను కర్టెను మీదినుంచి చూపులు చప్పున టీ కప్పుమీదికి మరల్చుకున్నాడు.

"రా సుశీలా!" ముసలాయన మరోసారి పిల్చాడు.

పరదా కదిలింది. హేస్టన్ చూపులు కప్పుమీదనుంచి నేల మీదకు వాలాయి. పరదా తొలగిం తర్వాత అడుగులు ముందుకు పడ్డాయి. యెంత కళ్లాలు వేసి కట్టి బిగించినా ఆగని హేస్టన్ చూపులు, నేలమీద నుంచి ముందుకు వస్తున్న పాదాలవయిపు జర జర పాకినాయి. ముదురు ఆకు పచ్చ చీరకి ఎఱ్ఱటి గీతలున్న జరీ అంచు కుచ్చెళ్ళని ముందుకు తన్నుకుంటూ వస్తున్న పాదాలు నల్లగా మోటుగా బొటన వ్రేలికి ప్రక్కవేలికి సన్నటి వెండి తీగల చుట్టలున్న పాదాలు ! హేస్టన్ చటుక్కున తలెత్తి సుశీలవైపు చూశాడు.

అంతే! కొయ్యబారిపోయాడు. అతని శరీరం ఊపిరి పీల్చుకోవాలి అన్న సంగతి కూడా మర్చిపోయింది. పొట్టిగా, లావుగా, ఊడిపోయిన జుట్టు, నుదుటి మీద బాగా పైకి పోగా అంద విహీనమైన పెదవులతో, కొంచెం యెత్తుగా ఉన్న పళ్ళతో అరసెకను కూడా హేస్టన్ చూపులు ఆ వ్యక్తి మీద నిలవకుండా వెళ్ళి మళ్ళీ కర్టెనుమీద నిలిచి ఆసక్తిగా చూడసాగాయి.

"రామ్మా! అతనే హేస్టన్."

సుశీల నమస్కారం చేసింది. ప్రతి నమస్కారం చెయ్యటం మర్చిపోయాడు హేస్టన్. అతనికి తను చూస్తున్నది కలో నిజమో అర్థం కాలేదు. మోటుగా, వికృతంగా ఉన్న ఆవిడ హేస్టన్ వూహించినట్టు పనిమనిషి కాదు, రావు భార్య. ముసలాయన ప్రక్కన కూర్చుంది వచ్చి. నిలువుగుడ్లేసుకుని సుశీల వంక చూస్తున్న హేస్టన్‌ని జూచి ముసలాయనకి కోపం వచ్చింది. అదేమిటి మరీ తినేస్తున్నట్లు అలా చూస్తాడేం. తను యెదురుగుండా ఉన్నాడనే సంకోచం గూడా లేదు ఆ చూపుల్లో. యెంతయినా ఫారెన్ వాళ్ళు ఫారెన్ వాళ్ళు. హేస్టన్ మర్యాదస్థుడు అనుకున్నాడు తను. అందుకే అది గుర్తించే అల్లుడు అమ్మాయిని చూపించి ఉండడు. తనేదో మహా గౌరవం చూపించబోయాడు. ఛీ - ఛీ - చూపులు ఎంత సేపు అలా మీద నిలబెడతాడు? కళ్ళజోడు లోంచి హేస్టన్ని చూస్తున్న ముసలాయనకి కోపం గూడా వచ్చింది.

ఇవేం గమనించని హేస్టన్ వెర్రివాడిలా ఇంకా సుశీలనే కన్నార్పకుండా చూస్తున్నాడు. అదెలా సాధ్యం! ఆమె రావు భార్య యెందుకవుతుంది? కొంపదీసి రావు కిద్దరు భార్యలు లేరుగదా! రెండో భార్య సంగతి వీళ్ళకు తెలియదేమో! సుశీల రూపం హేస్టన్‌లో వున్న సుందర భవనాల తాలూకు భావాల్ని పునాదుల్తో సహా పెళ్ళగించి పారేసింది. ఏదయినా రావు తన భార్య అని చెప్పి ఇచ్చిన ఫోటో ఈమెది గాదు. సుశీల దర్శనంతో హఠాత్తుగా షాక్ తిన్న అతని మనసు క్షణం సేపు దిమ్మెరపోయి వెంటనే మూగవోయింది.


హేస్టన్‌ను అసలు ఇంటికి పిలవటం తనది బుద్ధి తక్కువ అన్పించింది సుశీల తండ్రికి. సభ్యత, సంస్కారాలు గూడా మర్చిపోయి పిచ్చివాడిలా కళ్ళప్పగించుకుని చూస్తున్న ఈ పెద్దమనిషి ముందు సుశీలని మరోక్షణం ఉంచటం ఆయన కిష్టంలేక యేదో మాట చెప్పి లోపలకు పంపేడు. సుశీల వెడుతుంటే ఆవిడవంకే యాంత్రికంగా కళ్ళు తిరిగాయి. ఖర్మ! రాత్రికి వుండ

మని కూడా తీసుకొచ్చాను. అల్లుడికి తెలిస్తే ఏం కేకలేస్తాడో. అసలు అతని మాట వదిలేసి ఇప్పుడు ఇంకో క్షణం ఇంట్లో ఉంచుకోవాలంటే తనకే అసహ్యం వేస్తోంది. హఠాత్తుగా హేస్టన్ పట్ల కఠినంగా మారిపోయిన ముసలాయన మనసు ఇప్పుడు దిక్కేమిటిరా భగవంతుడా - అని ఆలోచించసాగింది.

ఏమీ తోచనట్టు దిక్కులు చూస్తున్న ముసలాయనకి దిక్కు చూపిస్తున్నట్టుగా హేస్టన్ తనకి తలనొప్పిగా ఉందనీ గెస్టుహవుస్‌కి వెడతాననీ ఏమీ అనుకోవద్దనీ అన్నాడు. హేస్టన్ అడగటం ఆలస్యం, ముసలాయన డ్రయివర్ని కేకవేశాడు.

బంగళాకి తిరిగి వచ్చేసిన హేస్టన్‌కి నిద్రపట్టలేదు. ఏమీ తోచటం లేదు. ఏమిటిది? ఎందుకిలా అయింది? కీలకం ఎక్కడుంది? రావ్ కాంప్ వెళ్ళటానికి దీనికీ ఏమి సంబంధం లేదుగదా? ఇన్ని రోజుల నుంచి ఇంత ఇదిగా తను ఆరాధిస్తున్న ఈ అమ్మాయి యెవరు? డైరీలోని ఫోటో వైపు చూస్తున్న హేస్టన్ ఆలోచనలు పరి పరి విధాల పోసాగినాయి. ఇంకా నయం. అదృష్టం, తను పెయింట్ చేసిన సంగతి వాళ్ళకి చెప్పలేదు. రావుకి మరో భార్య వుంటే వీళ్ళకి తెలియకుండా ఉంటుందా? భార్య కాకపోతే రావు భార్య అని అంత ధైర్యంగా యెలా చెప్పగలడు. రావు రాగానే అడిగి తెలుసుకోవాలి. ఎంత చక్కటి కళ్ళు, ఎంత అందమైన మొహం! ఆ ఫోటోలో అందం రావు భార్యది కాకపోతే ఇంకెవరిది అవుతుంది!

హేస్టన్‌కు ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. రేపు ఒక్కరోజు అతనిక్కడుండేది. రేపు సాయంత్ర కాంప్‌నుంచి రావు వస్తాడు. ఆ క్రితం రోజే కొంచెం జ్వరంగా ఉండటంవల్ల, ఆ రాత్రంతా నిద్రలేకపోవటం వల్ల మర్నాడు అతనికి జ్వరం మరింత తీవ్రంగా వచ్చింది. డాక్టర్ వచ్చి మందిచ్చి ఇంజక్షన్ చేసి ఆ రోజంతా యెక్కడికీ కదలవద్దనీ పూర్తిగా రెస్టు తీసుకోమనీ చెప్పి వెళ్ళి పోయాడు. ఆ రోజంతా వంటరిగా ఏ ప్రోగ్రాం లేకుండా గెస్టు హౌస్‌లోనే ఉండిపోయాడు.



సాయంత్రం అయింది. అప్పుడే టీ తీసుకుని మంచం మీద కుడిచేతి మీద వాలి పడుకుని కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. ఇంతలో తలుపు చప్పుడయింది. వెనక్కు తిరిగి చూశాడు హేస్టన్. వచ్చింది రావు.

"హల్లో!" రావు రెండడుగుల్లో వచ్చి మంచం మీద కూర్చున్నాడు. ప్రోగ్రాం ప్రకారం హేస్టన్ వెళ్ళిపోతాడు అనుకున్న రావు ఆ సాయంత్రానికి హైద్రాబాదు వచ్చేశాడు. అతని ఊహ ప్రకారం హేస్టన్ ఈ పాటికి ప్రయాణానికి సిద్ధమౌతూ వుండాలి. ఇంటికి వచ్చిన రావు పట్టుమని పది నిమిషాలు వుండకుండానే యేం జరిగిందీ చెప్పే అవకాశం సుశీల కివ్వకుండానే గెస్టు హౌస్‌కి పరుగెత్తుకొచ్చాడు. విదేశం నుంచి ఎంతో ఆత్రంగా వచ్చిన ఈ మిత్రుడికి తనేమాత్రం అప్యాయత ఇవ్వలేకపోయాననే బాధ అతని నర నరాల్ని కొరికి వేస్తోంది.

"హేస్టన్!" రావు సంతోషంగా, పడుకున్న అతనిమీద చేయివేస్తూ అన్నాడు.

రావు రాక - అతని పిలుపులోని అప్యాయత హేస్టన్ని కదలించలేదు. అతన్ని చూడగానే సుశీల విషయం అడిగెయ్యాలనిపిస్తోంది. రావు వైపు పరిశీలనగా చూసిన హేస్టన్, చూపులు మరల్చుకొని మళ్ళీ కిటికీ లోంచి బయటకు చూడసాగాడు.

"హేస్టన్! అదేమిటి, అలా ఉన్నావేం?" ఆదుర్దాగా అడిగాడు. బయటకు చూస్తున్న హేస్టన్ చూపులు మరల్చి రావు ముఖం మీద నిలిపి "రావ్ ఐ హావ్ సీన్ యువర్ వైఫ్" అన్నాడు పరీక్షగా చూస్తూ.

"యూ!" గబుక్కున లేచి నుంచున్నాడు ప్రసాదరావు. అతని మొహంలోకి ఒక్కసారిగా రక్తం పొంగింది. నుదుటిమీద నరాలు ఉబ్బినాయి. అంతే. ఆ చూపులోనే - రావు మొహం అలా యెర్రబడటంతోనే, హఠాత్తుగా ఆ లేచి నిలబడటంలోనే హేస్టన్‌కి అర్థమైపోయింది. రావు అబద్ధమాడాడు. అందంగా తనని మోసం చేశాడు. తనకిచ్చిన ఫోటో మరెవరయినా కావచ్చుగాక, రావు భార్య మటుకు కాదు. ఇద్దరి కళ్ళు క్షణం సేపు ఒకళ్ళ నొకళ్ళు పరిశీలనగా పరికించుకున్నాయి. ఇద్దరి మధ్య యేర్పడిన నిశ్శబ్దాన్ని చీలుస్తూ హేస్టన్ తనే "నువ్విప్పుడు కాంప్ యెందుకు వెళ్ళావో నాకర్థమైంది. నువ్వు క్యాంపు వెళ్ళలేదు. నా నుంచి ఈ రహస్యం దాచుకోటానికి పారిపోయావు. కాని ఆ రహస్యం బయటపడింది" అంటూ చూపులు గిరుక్కున తిప్పేసుకున్నాడు.

ప్రసాదరావు వెంటనే మళ్ళీ మంచం మీద కూలబడ్డాడు. మొహం తిప్పుకున్న హేస్టన్ రావువైపు చూడకుండానే "ఇంత చిన్న విషయంలో అబద్ధం ఆడాల్సిన అగత్యం ఎందుకు కలిగిందో నాకర్థం కావటంలేదు. ఛ! నే నసలు ఇండియా రాకుండా వుంటే బాగుండేది. నీ గురించి, ఈ ఫోటో గురించి నా కల కరిగిపోయేది గాదు." బాధగా అంటున్న హేస్టన్ మీద చేయివేసి అతని చేతిని గట్టిగా పట్టుకుంటూ "హేస్టన్! నేను చెప్పేది విను. నా మాట నమ్ము" అన్నాడు.

"నువ్వు చెప్పిన ప్రతిమాటా నమ్మాను." హేస్టన్ మాట చురకలా తగిలింది. అయినా యెలాగో నిగ్రహించుకున్న ప్రసాదరావు అసలేం జరిగిందో చెప్పసాగాడు.

"విను హేస్టన్! మన పరిచయం యేర్పడి మిత్రులుగా మనిద్దరం దగ్గరగా వచ్చినప్పటి నుంచి హిందూ దేశం అంటే నీకెంత అభిమానమో, హిందువులంటే ఎంత శ్రద్ధో - వాళ్ళ ఆచారాల మీద నీకెంత గౌరవమో నేను సరిగానే గ్రహించాను. మా పట్ల నీకున్న ఆదరానికి, అభిమానానికి అప్పుడప్పుడు గర్వించేవాడిని కూడా. సమయం దొరికినప్పుడల్లా మా గురించి మా ఆచారాల గురించి, మా ఆడవాళ్ళ గురించి, మా ఆచార వ్యవహారాల గురించి నువ్వడిగినప్పుడు అంతా వివరంగా చెప్పటం, నీకు తెలిసేలా చెప్పి మరింత కుతూహలాన్ని రేకెత్తించటం నాకు సంతోషంగానే ఉండేది. అవన్నీ వదిలెయ్యి. ఆ రోజు బహుశా నాకేగాదు, నీకూ గుర్తుండి ఉంటుంది. నా భార్య ఫోటో తెప్పించమని అడిగావు. అదీ వూరికేగాదు. నువ్వు మంచి చిత్రకారుడివి. ఇంతవరకూ చాలా దేశపు ఆడవాళ్ళని చిత్రించానుగాని, హిందూ దేశపు స్త్రీని చిత్రించలేదని, చిత్రించాలని ఉందనీ అప్పుడప్పుడు నాతో అంటూ వచ్చావు. నీవు పైకి చెప్పకపోయినా సుశీల ఫోటో అడగడంలో ఉద్దేశం అదేనని నాకు తెలుసు. కాని ఒకటి ఆలోచించు హేస్టన్! ప్రపంచంలో మగవాళ్ళకి కురూపులయిన భార్యలు ఉంటే ఉండవచ్చుగాక, కాని వాళ్ళని బయటకి సగర్వంగా ఏ మగాడు చెప్పలేడనుకుంటాను. నువ్వు ఫోటో అడిగే వరకూ నాకు సుశీల అందం గురించి ప్రశ్నే రాలేదు. చిన్నప్పటినుంచి మేం ఇద్దరం ఒకచోట పెరిగాం. పెళ్ళి చేసుకున్నాము. ఎప్పుడూ సుశీల మనసే తప్ప శరీరం ఎలాంటిది అన్న వివరమే నాకు రాలేదు. ఫోటో కోసం నువ్వు వత్తిడి చేశావు. నాకు తెలుసు! సుశీల ఫోటో నీలో కళాకారుడిగా చూపిస్తున్న నీ ఆసక్తి చంపేస్తుందని. రెండు రోజులపాటు నాకెటూ పాలుపోలేదు. నా భార్య అందగత్తెకాదు. అని చెప్పటానికి సిగ్గుపడ్డాను. ఏదో బలహీనత నన్ను చెప్పనివ్వలేదు. నువ్వు మంచి పెయింటర్‌వి. అందం గురించి నీకు తెలిసినంతగా చాలా కొద్దిమందికి తెలుసునని నాకు తెలుసు. అదేగాక చాలా ముఖ్యమైన విషయం! నా భార్య సుశీలలో నువ్వు హిందూ దేశపు స్త్రీని చూడాలని ప్రయత్నిస్తున్నావు.

"హేస్టన్! నా జాతిలోనే కాదు - ప్రతి జాతిలో సుశీల లాంటివాళ్ళు ఉంటారు. వాళ్ళకు జాతికి చిహ్నంగా ప్రతినిధిగా నిలబడే హక్కు లేదన్న సంగతి మనకు తెలుసు. అందుకే ఆలోచించి బుర్ర బద్దలు చేసుకొని చివరికీ నిర్ణయానికి వచ్చి ఇక్కడే ఈ హైద్రాబాద్‌లోనే ఓ ఫోటో స్టూడియో ఉన్న నా స్నేహితునికి అందంగా ఉన్న ఓ అమ్మాయి ఫోటో పంపమని రాశాను. అతను పంపాడు. అది నీకిచ్చి నా ఫ్రండ్‌దని చెప్పాలనుకున్నాను. కాని గుర్తుతెచ్చుకో. నువ్వసలు నన్ను ఊపిరి ఆడనిస్తేనా! నా భార్యదే అనుకున్నావు, అభినందించావు. కాదు అని తెలియజేసే అవకాశమే ఇవ్వలేదు నాకు. పైగా ఆ క్షణంలోనే అక్కడున్న మన మిత్రులకి రావు భార్య అని చూపించావు. అంతటితో ఊరుకోలేదు. లైఫ్ సైజులో పెయింట్ చేస్తానన్నావు, చేశావు. ఎగ్జిబిషన్‌లో పెట్టావు. ఎగ్జిబిషన్ అంతటికీ దానికి బాగా పేరు వచ్చినమాట నిజమే. "హిందూదేశపు అందం" అన్న ఆ బొమ్మని చూసి అందరూ మెచ్చుకుంటూ 'యెవరీ అమ్మాయి? యెక్కడ సంపాయించావు?' అని అడిగినప్పుడల్లా

నన్ను చూపించి నా ఫ్రెండ్ భార్య అని చెప్పేవాడివి. గర్వంతో నీ ఛాతీ ఎంత పైకి లేచేదో! తప్పు చేశాను, దీనికి నాకు అర్హత లేదు. అన్న బాధతో నేనెంత కుంగిపోయేవాడిని. తర్వాత మెల్ల మెల్లగా నేను దీనికి అలవాటు పడిపోయాను. దానివల్ల ప్రమాదం నాకేం కన్పించలేదు. అందుకే అ చిన్న ఫోటో - ఎవరో తెలియని అమ్మాయి ఫోటో నీ కిచ్చాను. నేను చేసింది పొరపాటే. ఒప్పు కుంటాను. నా ఈ పొరపాటు నీకెప్పుడో చెప్పాలని ఎంతగానో ప్రయత్నించాను. కాని నాకు అవకాశం రాలేదు. ఇప్పుడు చెప్పు హేస్టన్! నువ్వు వస్తున్నావంటే యెంతో సంతోషం అన్పించింది. నేను నీనుంచి పారిపోయినమాట నిజం. సుశీలని నీకు చూపించాల్సి వస్తుందని భయపడ్డాను. కాంప్‌లో ఒంటరిగా కూర్చొని నేను పడ్డ బాధ భగవంతుడికి తెలుసు. నన్నర్థం చేసుకోగలిగితే నన్ను క్షమించు. నాకిప్పుడు నిజంగానే తేలికగా వుంది....'' మంచం మీద నుంచి రావు, హేస్టన్‌కి దూరంగా వెళ్ళి సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు.

ఇద్దరి మధ్య నిశ్శబ్దం ఏర్పడింది. రెప్పవాల్చటం, ఊపిరి పీల్చటం మర్చిపోయి రావు చెబుతున్న ప్రతి అక్షరాన్ని శ్రద్ధగా వింటున్న హేస్టన్ మెల్లగా లేచి సరిగ్గా కూర్చున్నాడు.

"ఒక్కోసారి పరిస్థితులు మనిషిని చిత్రంగా ఆడిస్తాయి!'' కిటికీ దగ్గరగా వెళ్ళిన రావు హేస్టన్ వైపు వీపు పెట్టి బయటకు చూస్తూ అన్నాడు. అతని కిప్పుడు తేలికగా వుంది. జరిగింది హేస్టన్‌కి తెలిసింది. అతని దృష్టిలో తను వంచకుడేమోనన్న బాధ ఇహ తనకుండదు.

వెనుకనుంచి భుజం మీద చెయ్యి పడడంతో తల తిప్పి వెనక్కు తిరిగి చూశాడు. హేస్టన్ రావు భుజాలు పట్టి తన వైపు తిప్పుకుంటూ "క్షమించు రావ్! జరిగినదాంట్లో నాకూ సగభాగం ఉందని ఒప్పుకుంటున్నాను'' అన్నాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. "థాంక్స్!'' రావు మరో సిగరెట్ తీసి హేస్టన్ నోట్లో పెట్టి లైటరుతో వెలిగించాడు.



"అయితే ఈ అమ్మాయి యెవరై వుంటుంది? డైరీలో ఫోటో వంక చూస్తూ హేస్టన్ అన్నాడు.

"ఎవరో నాకు తెలియదు. కానీ అదృష్టవంతురాలు!''

"యెందువల్ల?'' ప్రశ్నార్థకంగా చూశాడు హేస్టన్. "కాదా మరి! ఊరూ పేరూ తెలియకుండా - తన విషయం తనకి తెలియకుండానే నీలో ఇలాంటి స్థానం ఏర్పరచుకోవటం. నువ్వు పెయింట్ చేస్తున్నప్పుడే అనుకున్నాను.'' రావుతో పాటు హేస్టన్ కూడా నవ్వాడు. అతనికికూడా చిత్రంగానే ఉంది.

"రావ్! నేనీ అమ్మాయిని చూడాలి ఎలాగైనా సరే - చూడందే అమెరికా వెళ్ళను!''

"అసంభవం! ఆ ఫోటో చాలా పాతది. మా హిందూదేశంలో ఆడపిల్లలని నమ్మటానికి వీల్లేదు. ఈ రోజు అమ్మాయిలా వుండి, రేపు చూస్తే అమ్మమ్మలా అయిపోతారు.''

"ఎలా ఉన్నాసరే, నేను చూసి తీరాలి రావ్! నాకెందుకో బలంగా అనిపిస్తుంది. చూడందే నేనసలు వెనక్కు వెళ్ళలేను.''

"ఆ అమ్మాయి యెవరో, ఎక్కడుంటుందో ఎలా తెలుస్తుంది? పెళ్ళయిపోయి వుండవచ్చు.''

"లేదు లేదు. అయివుండదు. అందమైన ఈ కళ్ళు నాకోసమే చూస్తుండి వుండవచ్చు. అసలందుకే, ఈ అమ్మాయి కోసమే నేను ఇండియా రావటం తటస్థించిందేమో! ప్లీజ్! నువ్వు ఇప్పుడైనా ఆఫీసుకి శెలవు పెట్టి తీరాలి. మనం మొదట ఆ ఫోటో స్టూడియోలో వాకబుచేద్దాం!'' హేస్టన్ అన్నాడు.

ఆ రాత్రి హేస్టన్ పడుకున్నాడన్న మాటేగాని అసలు నిద్ర పట్టలేదు. కుడి చెయ్యి తలకింద పెట్టుకుని యెడంచేత్తో ఫోటో చూస్తూ చాలా సేపు అలాగే ఉండిపోయాడు. థ్యాంక్ గాడ్! ఇంత అందమైన అమ్మాయి రావు భార్యకాదు అని గుర్తుకువస్తే ఇప్పుడెంతో రిలీఫ్‌గా వుంది! ఇదివరకల్లా ఆ ఫోటో రావు భార్యగా, సుశీలగా గౌరవం మటుకే వుండేది. ఆలోచనలకి పరిమితి వుండేది. ఇప్పుడు ఆలోచన్లు హద్దుదాటి ప్రవహిస్తున్నాయి. ఇది వరకు స్నేహితుడి భార్యగా మనసులో ఓ మూలమటుకే స్థానం సంపాయించుకున్న ఈ ఫోటో ఇప్పుడు ఇంతయై అంతయై అన్నట్టు మనసంతా ఆక్రమించుకొన్నది. రెప్ప వాల్చకుండా ఫోటోవైపే చూస్తున్న అతనికి ఒక్కసారి ఆ ఫోటోలోని అమ్మాయి సజీవంగా కదిలి, అందమైన ఆ మొగాన్ని తన చేతులలోకి తీసుకున్నట్లు, దూరంగా ఏవో సుందర దృశ్యాలు పరిశీలిస్తున్నట్టు అనుభూతిని సూచించే ఆ సోగకన్నులు తన పెదవుల్తో సున్నితంగా తాకుతున్నట్టు అన్పించింది. తను ఆ అమ్మాయిని ఎక్కడ ఏ మారుమూల ఉన్నాసరే వెతికి పట్టుకోవాలి. పట్టుకుని ఎలాగయినా సరే తన స్వంతం చేసుకుని అమెరికాకి వెంట తీసుకెళ్ళిపోవాలి. అసలు మొట్టమొదట రావు ఇచ్చిన ఫోటో చూసినప్పుడే తను అదోరకంగా ఫీలయ్యాడు. అది కేవలం అందం చూసి అనుకున్నప్పుడు. ఒకవేళ రావు అన్నట్టు ఈ పాటికి పెళ్ళయిపోతే! ఊహు కాదు, అయివుండదు. తనకోసమే ఎదురు చూస్తోందేమో! హేస్టన్ చేతిలో ఉన్న ఫోటోని చెంపలకి, నుదిటికి, కళ్ళకి తాకించుకుంటూ "ఐ లవ్ యూ, మై డార్లింగ్!'' అనుకున్నాడు.

మర్నాడు మిత్రులిద్దరూ కలిసి ఫోటో స్టూడియోకెళ్ళారు. వీళ్ళు అడిగిన ఫోటో తాలూకు అమ్మాయి యెవరో, ఎక్కడ వుంటుందో వారు చెప్పలేకపోయారు. స్టూడియో యజమాని అసలు రావుకి తను ఫోటో పంపిన సంగతి కూడా మర్చిపోయాడు.

"నేను మొదటే చెప్పాను. చాలా అసంభవం!'' స్టూడియోలోంచి బయటికొస్తుండగా అన్నాడు రావు. కాని హేస్టన్‌కి నిరాశగా తోచలేదు. అతనికి తెలియని, అర్థంగాని శక్తి ఒకటి "లేదు లేదు - ఆ అమ్మాయి కన్పిస్తుంది, కన్పించి తీరుతుంది!'' అని వెర్రిగా అరవటం మొదలు పెట్టింది.

హేస్టన్ అనుకున్నదానికంటె మరో రోజు ఎక్కువే ఉన్నాడు. ఆ ఒక్క రోజు రావ్ ఒక్క క్షణంగూడా విడిచిపెట్టలేదు. తన ఇంట్లో తమ ప్రక్కనే హిందువుల ఆచారం పాటిస్తూ హేస్టన్‌ను కూర్చోపెట్టుకున్నాడు. ఈసారి సుశీల తనే స్వయంగా వడ్డించింది. హేస్టన్‌కీసారి సుశీల మొదట కన్పించినంత వికృతంగా కన్పించలేదు.

ప్రోగ్రాం ప్రకారం హేస్టన్ రావ్ దగ్గర శెలవు తీసుకుని బెంగుళూరు వెళ్ళిపోయాడు. అతడికి వీడ్కోలు ఇవ్వడానికి సుశీల, పిల్లలు గూడా వచ్చారు. ఆఖరిసారిగా వీడ్కోలు ఇస్తూ "ఫోటో గురించి మర్చిపో'' అని హెచ్చరించాడు రావు. 'అది అసంభవం. ఆ ఫోటో మర్చిపోతే ఇండియానే మర్చిపోయినట్టు అవుతుంది. ఎలాగయినా సరే చూసి తీర్తాను అన్పిస్తోంది నాకు,'' నవ్వుతూ జవాబిచ్చాడు హేస్టన్. ఈ కొద్ది కాలంలోనే ఆ ఫోటోలోని అమ్మాయి అతనికి ప్రపంచంలోకెల్లా ప్రియాతిప్రియమైన వస్తువైపోయింది.

ప్రోగ్రాం ప్రకారం హేస్టన్ రాష్ట్రం రాష్ట్రం మారుతూ ఇండియాలోని అతి ముఖ్యమైన ప్రదేశాలు, చారిత్రాత్మక స్థలాలు చూస్తున్నాడు. ప్రభుత్వం తన కోసం ప్రత్యేకంగా ఏర్పరచిన కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు. విందులలో ప్రసంగిస్తున్నాడు. తన గౌరవార్థం ఏర్పరచిన సభలలోమాట్లాడుతున్నాడు. మొత్తానికి ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, సభలో వేదికమీద నిలబడి మాట్లాడుతున్నా, విందులో ముఖ్యమయిన వాళ్ళ మధ్య కూర్చుని భోం చేస్తున్నా, ఎక్కడ ఏకాస్త ఆడవాళ్ళ గుంపుకన్పించినా హేస్టన్ పరీక్షగా వాళ్ళవైపే చూస్తున్నాడు. చారిత్రాత్మక స్థలాలు చూడటానికి వెళ్ళినప్పుడు ఓ కంట వాటి కళా నైపుణ్యాన్ని పరిశీలిస్తూనే మరోకంట అక్కడికి వచ్చిన వాళ్ళని పరికిస్తుండేవాడు. ఇండియాలో అతను ఉండవలసిన రోజులు క్షణాల్లో గిర్రున తిరిగిపోతూనే ఉన్నాయి. హేస్టన్‌కి తన ఫోటోలో ఉన్న అమ్మాయి మాట అటుంచి కనీసం అలాంటి పోలికలున్న అమ్మాయి గూడా కన్పించలేదు. "కన్పిస్తుంది. కన్పించి తీరుతుంది''- అన్న అతని దృఢమైన నమ్మకం హారతి కర్పూరంలా హరించుకుపోసాగింది. వంట్లో బాగా లేదని, ప్రయాణం చేసే స్థితిలో లేననీ డాక్టర్ సర్టిఫికెట్స్‌తో ఎలాగో కష్టపడి ఉభయ ప్రభుత్వాల దగ్గర మరో వారం రోజులు ఉండేందుకు అనుమతి సంపాయించుకున్నాడు. పోనీ, తను ఊహించినట్టు తన కోసం వేచి ఉండకపోతే మానె, పెళ్ళయి పిల్లల్తోనే ఆ అమ్మాయి ఒక్కసారి కన్పించగూడదూ! దూరం నుండి అయినా ఒక్కసారి

చూస్తే తృప్తిగా వెళ్ళిపోగలడు.

హేస్టన్ సంపాయించుకున్న అనుమతిలో మరి నాలుగు రోజులే మిగిలినాయి. ఫోటోలో అమ్మాయి కోసం వెతికి వేసారి ప్రయాణపు బడలికతో కొద్దిగా అలిసిన హేస్టన్ తన ప్రయాణంలో ఆఖరి ప్రోగ్రాంగా తుంగభద్ర డామ్ వచ్చాడు. ఇక్కడ హేస్టన్ స్నేహితుడికి పెంతల్లి కొడుకు అయిన జాన్ డామ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగరీత్యా నాలుగు సంవత్సరాల నుంచి ఇండియాలోనే ఉన్న జాన్ దంపతులకి హిందువుల ఆచార వ్యవహారాలు, వాళ్ళ వేష భూషణాలు తెలియటమే గాక వాళ్ళ భాషగూడ మాట్లాడడం, అర్థం చేసుకోవడం వచ్చింది.

తమ స్వదేశాన్నుంచి వస్తున్న ఈ మిత్రుడిని జాన్ దంపతులు ఆర్భాటంగానే ఆహ్వానించారని చెప్పాలి. హేస్టన్ కోసం డామ్‌కి కుడి వైపున ఎత్తుగా కొండ మీద పంపా దర్శన్‌కి ప్రక్కగా వున్న "వైకుంఠం" గెస్టుహౌస్‌లో బస ఏర్పరిచారు. మర్నాడు సాయంత్రం డామ్‌లో వున్న ముఖ్యమైన ఉద్యోగస్తులందరికీ పరిచయం చేయటం కోసం తమ ఇంట్లో చిన్న టీ పార్టీలా ఏర్పాటు చేశారు.

పార్టీ అందరికీ అనుకూలంగా ఉండే పదార్థాలతో అందంగా పొందికగా ఏర్పాటు చేయబడింది. మిసెస్ జాన్ కూడా ఇండియన్స్‌లా చీరెకట్టుకొని స్లీవ్‌లెస్ బ్లవుజ్ వేసుకుంది. పొడుగ్గా బలంగా వున్న మిసెస్ జాన్ ఈ బట్టల్లో చాలా అందంగా ఉందనీ, తనకీ దేశపు ఆడవాళ్ళు ధరించే ఈ దుస్తులు చాలా ఇష్టమనీ ఆవిడని అభినందిస్తూ చెప్పాడు హేస్టన్. ఆరు గంటలు కాగానే ఒక్కొక్కరే రావటం మొదలు పెట్టారు. వచ్చిన ప్రతి వ్యక్తికి జాన్ దంపతులు హేస్టన్‌ని పరిచయం చేశారు. వచ్చిన వాళ్లల్లో ఇద్దరు ముగ్గురు జపనీస్ ఇంజనీర్లు తప్పితే మిగతా వాళ్ళంతా ఇండియన్సే. దాదాపు రావులా వున్న వాళ్ళే! వాళ్ల వెంటవచ్చిన ఆడవాళ్ళు గూడా చాలా సామాన్యంగా ఉన్నారు. వాళ్ళలో చాలామంది హేస్టన్ నమస్కరిస్తుంటే కనీసం కళ్ళెత్తి గూడా చూడలేదు. ఇద్దరుమటుకు హేస్టన్‌ని వచ్చీరాని ఇంగ్లీషులో ఏదో అడిగారు. వాళ్ళిద్దరూ కూడా వేష భాషల్లో ఆడంబరం తప్పితే సహజంగా మనసుని ఆకర్షించే అందంగా ఏం కన్పించలేదు. దాదాపు అంతా వచ్చేశారు కాబోలు మిసెస్ జాన్ మరోసారి ఆడంబరంగా హేస్టన్‌ని పరిచయం చేసి పార్టీ మొదలు పెట్టడానికి ఉపక్రమించింది. హేస్టన్ హాలులో గోడవారగా వున్న పియానో ముందున్న స్టూలు మీద కూర్చుని పియానో మెట్లు నొక్క సాగాడు. ఇవాళ అతని మనసెందుకో చాలా ఉదాసీనంగా ఉంది. రెండు రోజుల గడువుంది తనకు. ఇండియానుంచి వెళ్ళిపోవాలి. ఫోటోలో ఆ అమ్మాయి ఇహ జన్మలో కనిపించదు. ఇక్కడ ఏర్పడిన ఈ పార్టీ దాదాపు ఆఖరిదని చెప్పవచ్చు.



పరధ్యాసగా మెట్లు ఎక్కుతున్నహేస్టన్ దగ్గరగా వచ్చి ప్రక్కగా కుర్చీలాక్కుని కూర్చుంటూ "ఏదయినా పాటవస్తే పాడు" అంది మిసెస్ జాన్.

"నిజం! మాకూ వినాలనిపిస్తోంది" దూరంగా వున్నటేబిల్ దగ్గర నుంచి ఎవరో రిక్వెస్టు చేశారు.

"పాడవోయ్, చాలా రోజులైంది విని." పైప్ కాల్చుకుంటున్న జాన్ హేస్టన్‌ని చూస్తూ బలవంతం చేశాడు.

"పాటా! నేనా?" హేస్టన్ చిన్నగా నవ్వాడు. అతనికి పాడటం అంత బాగా రాదు. కాని, పాడితే కంఠం మటుకు అసహ్యంగా వుండదు.

హేస్టన్ కెదురుగా కూర్చుని తనవైపు ఆసక్తిగా చూస్తున్న మిసెస్ ఆన్ కూర్చున్నదల్లా హఠాత్తుగా లేచి "హల్లో సుజాతా! రా.... రా... నువ్వు రావనుకున్నాను ఇంత ఆలస్యం చేసావేం?" ప్రశ్నలు వేస్తూనే ఎదురు వెళ్ళింది. అందరూ వెనక్కు తిరిగి గుమ్మం వైపు చూశారు. కూర్చునే అలా పియానో మెట్లు నొక్కుతూనే హేస్టన్ తల తిప్పి భుజం మీదుగా వెనక్కు చూశాడు. అంతే! అతని ఆకుపచ్చటి చిన్న చిన్న కళ్ళు వెడల్పు అయినాయి. వేళ్ళు పియానో మెట్లని హఠాత్తుగా వదిలేసినాయి. హేస్టన్ లేచి నిలబడ్డాడు. క్షణం సేపు అతని కళ్ళు తనని మోసం చేస్తున్నాయేమో అనే భ్రమ కలిగింది.

గుమ్మంలో ఎర్రటి చిన్న చిన్న గులాబీలు మాలగా గ్రుచ్చినట్టున్న అందంగా పూలు కుట్టబడిన అంచుగల తెల్లటి చీరతో మెరుపులాటి చిరునవ్వు మొహం మీద మెరిసిపోతూండగా పాలరాతి బొమ్మలా హాలులో మిసెస్ జాన్ చేతిలో చేయి వుంచి ఒక కాలు గుమ్మం లోపల వేసి నిలబడి మాట్లాడుతున్న వ్యక్తి సుజాత! హేస్టన్ మిసెస్ జాన్ పిలవకుండానే నిద్రలో లేచి నడుస్తున్న వాడిలా, రెప్ప వేస్తే కళ్ళ ముందు కన్పిస్తున్న కల చెరిగిపోతుందేమోననే భయంతో రెప్పవాల్చకుండా అలాగే ముందుకు వచ్చాడు.

"సుజాత ఇక్కడ పనిచేస్తున్న జె.ఇ.లలో ఒకరైన భాస్కరం గారి భార్య. సుజాతా! తెలుసు గదా? హేస్టన్" మిసెస్ జాన్ పరిచయ వాక్యాలు అతని చెవిని పడనేలేదు. అవే సోగ కళ్లు, ఆ పెదవులు, సందేహం లేదు.

"సుజా! వాట్ ఎ లవ్‌లీ నేమ్?" మతిపోయినవాడిలా సుజాత వైపు పరీక్షగా చూస్తున్న హేస్టన్ పరధ్యాసగా మర్చిపోయి కరచాలనం కోసం చెయ్యి చాచాడు.

"నో! మగవాళ్ళతో చేతులు కలపటం ఈ దేశపు ఆడవాళ్ళకి ఆచారం కాదు." చక్కటి ఇంగ్లీషులో వేయి వెన్నెలలు విరుస్తున్న చిరునవ్వుతో మెత్తగా జవాబు చెప్పింది సుజాత.

మిసెస్ జాన్ నవ్వి, సుజాత భుజం మీద తట్టి లోపలకు తీసుకువెళ్ళింది. వాళ్ళ వెనకే వస్తున్న హేస్టన్ని మిస్టర్ జాన్ ఆపి తాము మాట్లాడుతున్న పాలిటిక్సులోకి దింపబోయాడు. ఆయన మాటల్లో ఒక్క అక్షరంగాని, కనీసం దాని పొల్లు గూడా వినని హేస్టన్ కూర్చోమన్న ఆయన చేతిని వదిలించుకుని సుజాత కూర్చున్నవైపు వచ్చేశాడు. అతనికి ఈ మనుష్యులు, ఈ పార్టీ దీని గంద్రగోళం ఏమీ విన్పించటం లేదు. ఒక్క సుజాతే కన్పిస్తోంది. తను ఊహించిన దానికంటే అందంగా వుంది. సజీవంగా కళ్ళ ముందు కదులుతున్న ఈ అందం అతన్ని వెర్రివాణ్ణి చేసేస్తోంది. గుడ్ గాడ్! హేస్టన్‌కి రెండు చేతులు చాచి బొమ్మలా పొందికగా కూర్చుని మిసెస్ జాన్‌తో మాట్లాడుతున్న సుజాతని పట్టుకుని పైకెత్తి ఎక్కడికన్నా దూరంగా ఒంటరి ప్రదేశానికి పారిపోవాలనిపిస్తోంది. అక్కడ గాలి, వెలుతురు, నీరు తప్ప మనుష్యులుండ కూడదు.

పార్టీ జరుగుతున్నంతసేపు హేస్టన్ చూపులు సుజాతని అనుసరిస్తూనే వున్నాయి. ప్రతి కదలికని గమనిస్తూనే ఉన్నాయి. మధ్య మధ్య అనుకోకుండా సుజాత చూపులు తనతో కలిసినప్పుడు మటుకు అతనికి కాలం ఆగిపోయినట్టే అన్పించింది. ఒక ప్లేటులో స్వీట్స్, యాపిల్ ముక్కలు పెట్టి తెచ్చి సుజాతకిచ్చాడు. క్షణంసేపు అతను చూపుతున్న ఈ ప్రత్యేకతకి ఖంగారుపడిన సుజాత "థాంక్స్!" అంటూ తీసుకుంది. హాల్లో వున్న మిగతా అందరి దృష్టి దీనిమీద పడకపోలేదు. దూరంగా అక్కడక్కడా కూర్చున్న ఆడవాళ్ళకి ఇది అసూయ కారణం కూడా అయింది.

పార్టీ అయిపోయింది. అందరితోపాటు సుజాత కూడా సెలవు తీసుకొని వెళ్ళిపోయింది. హేస్టన్ ఎంత ప్రయత్నించినా ఒక్క నిమిషం సుజాతతో మాట్లాడే అవకాశం దొరకలేదు. సుజాత వెళ్ళిపోగానే ఓ పక్కగా నిలబడిపోయిన హేస్టన్, అందరూ వెళ్ళిపోగానే మిసెస్ జాన్ దగ్గరకు ఆత్రంగా పరుగెత్తుకొచ్చి "ఈ సుజా అన్న అమ్మాయి ఎవరు?" అన్నాడు.

"సుజా కాదు, సుజాత."

"అదేలే, ఎవరు?"

"చెప్పాను కదూ - జె.ఇ.ల్లో ఒకతని భార్య అని."

సుజాత పట్ల అతని ఆసక్తి మొదట్లోనే గ్రహించింది మిసెస్ జాన్.

"నేను ఆ అమ్మాయిని యింకోసారి కలుసుకోవాలి - ఎలా?"

అదుర్దాగా అడిగాడు. జాన్ దంపతులిద్దరూ మొహ మొహాలు చూసుకున్నారు. మిసెస్ జాన్, హేస్టన్ మాట విననిదానిలా పని చూసుకోసాగింది.

"నిజం. ఆ అమ్మాయి నింకోసారి నేను చూడాలి. ఒంటరిగా ఎక్కడయినా సరే."

పైప్ కాల్చుకుంటున్న మిస్టర్ జాన్, దగ్గరగా వచ్చి, హేస్టన్ భుజం మీద

చేయి వేస్తూ తట్టి, "అబ్బాయ్ ఇది అమెరికా కాదు, జాగ్రత్త! ఇక్కడి వారికి ప్రాణాల కంటే ఆచారాలు ముఖ్యం" అన్నాడు హితబోధ చేస్తున్న మత గురువులా మొహం పెట్టి.

"అబ్బెబ్బె. అదిగాదు - నేనడగటంలో ఉద్దేశ్యం."హేస్టన్, జాన్ దంపతులకి సుశీల ఫోటో సంగతి చెప్పాడు. అందులో రావ్ భార్య అని చెప్పటం, తను పొరబడటం, సుశీలని చూసి షాక్ తినటం యివి మటుకు మినహాయించేశాడు.


"అరె, గమ్మత్తుగానే ఉందే" అంది మిసెస్ జాన్ కుతూహలంగా.

"అబద్ధం గాదు. గెస్టుహౌస్‌కి మీరిప్పుడొస్తే నేనా ఫోటో చూపిస్తాను."

"ఇదిగో ఏమయినా - ఆ అమ్మాయిని నువ్వు ఒంటరిగా కలుసుకోవాలి అనుకోవటం మటుకు వెర్రితనం. పెళ్ళయిన పిల్ల. ఇదేదైనా బయకు వస్తే నీ పరువు, మా పరువు ఇద్దరిదీ దక్కదు. ఆ ఆలోచన మటుకు అంతటితో విరమించు. ఇంక ఎన్ని కథలన్నా చెప్పు వింటాం" అని అక్కడినుంచి వెళ్ళిపోయాడు జాన్.

జాన్ వెళ్ళిపోయినవంకే దిగులుగా చూస్తుండిపోయిన హేస్టన్‌ని చూస్తే మిసెస్ జాన్‌కి జాలేసింది. ఆ రాత్రి గెస్ట్‌హౌస్‌లో హేస్టన్ డైరీలో ఫోటో చూసింది. సందేహం లేదు. అది సుజాతదే. సుజాతా వాళ్ళింట్లో గూడా ఇదే ఫోటో పెద్దదిగా ఫ్రేమ్ కట్టించి వుంది. మరోసారి వివరంగా హేస్టన్ నోటినుంచి కథంతా విన్న తర్వాత తనెలాగైనా సుజాతతో ఒంటరిగా కలుసుకునే ఏర్పాటు చేస్తానని మాట యిచ్చింది. మాట యిచ్చే ముందు పొరపాటున కూడా హద్దుమీరి ప్రవర్తించనని హేస్టన్ దగ్గర మాట తీసుకుంది.

ఆ రాత్రి హేస్టన్ నిద్రపోలేదు. ఫోటోలో కంటే ఎంత బాగుంది సుజాత! ఫోటోలో అమాయకంగా ముగ్ధురాలిలా వుంది. ఇవతల నిండుగా హుందాగా ఉంది. అవును మరి. అది నాలుగైదు సంవత్సరాల నాటి ఫోటో. అప్పటికి బహూశా ఏ యిరవైయేళ్ళో వుండవచ్చు. ఫోటోలో సుజాత కంటే ఇవతల కన్పించే సుజాతలో పరిపూర్ణత కన్పిస్తోంది. హేస్టన్ ఫోటో వెనక అందంగా పెయింట్ చేసినట్టు "సుజా" అని చెక్కుతూ కూర్చుండిపోయాడు.



అతని మనసులో రేగుతున్న ఈ తుఫానుకి తను కారణం అని ఏమాత్రం తెలియని సుజాత ఆ రాత్రి ప్రతి రాత్రిలాగానే నిశ్చింతగా నిద్రపోయింది. చిన్నప్పటినుంచి ఎక్కడికి వెళ్ళినా, ఎంతమందిలో వున్నా అందరిచేత యిలా ప్రత్యేకం గుర్తింపబడటానికి అలవాటు పడిపోయిన సుజాతకి యిది పెద్ద విశేషంగా కన్పించలేదు. ఇదివరకు ఒకళ్ళిద్దరు ఫారనర్స్‌ని సుజాత చూసింది. వాళ్ళతో పరిచయం కూడా కలిగింది. మెత్తగా సిల్కులా వున్న జుట్టుతో, పరిపూర్ణమైన ఆరోగ్యం తొణికిసలాడుతూ మంచి పెయింటర్ అయిన ఈ అమెరికన్ కూడా స్వయంగా తనంటే శ్రద్ధాసక్తులు చూపించాడని గుర్తు రావడంతో సుజాత మరింత గర్వంగా తృప్తిగా నిద్రపోయింది.

మర్నాడు మధ్యాహ్నం భర్త ప్రక్కన నిలబడి వుండగానే మిసెస్ జాన్ సుజాతకి ఫోన్ చేసింది. రాత్రికి వైకుంఠంలో ప్రత్యేకంగా డిన్నర్ ఏర్పాటు చేశామని, ఎలాగూ భర్త ఊళ్ళో లేడు కాబట్టి, ఒంటరిగానే ఉంది కాబట్టి, నువ్వు కూడా వస్తే సరదాగా భోంచెయ్యొచ్చని చెప్పింది. భర్త ఊళ్ళో లేడు, గడియారం చూసుకుంటూ, గంటలు లెక్కపెట్టుకుంటూ పొద్దెలా గడపాలా అని బద్ధకంగా కూర్చున్న సుజాతకి మిసెస్ జాన్ ఆహ్వానం ఆహ్లాదం కలిగించింది. అదీకాక అందంగా పొడుగ్గా వున్న ఈ అమెరికన్‌ని మరోసారి చూడాలని మనసులో రహస్యంగా వున్న కాంక్ష కూడా మిసెస్ జాన్ ఆహ్వానాన్ని వెంటనే ఒప్పేసుకునేలా చేసింది. సాయంత్రం ఆరు గంటలకల్లా రెడీ అయి ఉంటే తను వచ్చి "వైకుంఠం" గెస్ట్‌హౌస్‌కి తీసుకువెడతానని మిసెస్ జాన్ చెప్పింది. సుజాత అంగీకారం తెల్పింది.

ఎలాగో గంటలు గడిచాయి. సాయంత్రమైంది. వైకుంఠం భవనంలో కుడివైపుగా వున్న గదిలో హేస్టన్ సుజాతని కలుసుకోబోతున్నాడు. గది ముందున్న వరండాలో స్తంభాన్నానుకుని నిలబడ్డ హేస్టన్ బైట పిండారబోసినట్టున్న వెన్నెలని శ్రద్ధగా చూస్తున్నాడు. దూరంగా మర్మర ధ్వనులతో ఏదో సంకేతాన్నిస్తున్నట్టున్న తుంగభద్ర రొద! అతను ఇంతకంటే బ్రహ్మాండంగా ఉండి, అద్భుతంగా వున్న ప్రాజెక్టులని చూశాడు. ఇంతకంటే అందమైన రాత్రులు చూశాడు. కాని, అతని ముప్ఫయేళ్ళ జీవితంలో ఈ క్షణాలు, ఇలా ఆదుర్దాగా ఒకరికోసం ఎదురుచూడటం పూర్తిగా కొత్తగా వుంది. దూరంగా నది మీదనుంచి సన్నగా వీస్తూ వచ్చిన చల్లటి గాలి అతని నుదురుని తాకి పొడిపొడిగా ఉన్న జుట్టుని కొద్దిగా రేపుతోంది. మెడలో వున్న టై సన్నగా కదుల్తోంది. ఈరోజు అతని దుస్తుల్లో ప్రత్యేకత వుంది. జుట్టు దువ్వుకోవటంలో శ్రద్ధ కనిపిస్తోంది. మనసులో ఏర్పడిన ఏదో ఖంగారు ప్రతి చర్యలోనూ కదిలి స్థిరంగా ఒక్కచోట నిలబడటం లేదు. కొంచెంసేపు లోపల సోఫాలో కూర్చున్నాడు. ఇంకొంచెంసేపు వరండాలోకి వచ్చి పాంట్ జేబులో చేతులు పెట్టుకుని అటూ ఇటూ పచార్లు చేశాడు. చివరికి వచ్చి స్తంభాన్నానుకొని నిలబడిపోయాడు. సుజాత వస్తుందా? అసలీ జన్మలో మళ్ళీ తను చూస్తాడా? మిసెస్ జాన్ సరిగ్గా రెండు గంటలు గడువు ఇచ్చింది. ఎంత అమూల్యమూన కాలం! స్తంభాన్నానుకుని తిరస్కరిస్తే ఏం చెయ్యటం? గోడవారగా వున్న డ్రెస్సింగ్ టేబిల్‌కు అమర్చి వున్న అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకుంటూ ఏమిటో పిచ్చిగా అనుకుంటూండగా ఇంతలో బయట వరండాలో నుంచి "హేస్టన్" అన్న మిసెస్ జాన్ పిలుపు విన్పించింది. ఉలిక్కిపడ్డ హేస్టన్ గిరుక్కున వెనక్కి తిరిగి చూశాడు. గుమ్మంలో చిరునవ్వుతో మిసెస్ జాన్ నిలబడింది. వెనుక సుజాత వుంది. మిసెస్ జాన్ మాట అంటే సాధించగల సమర్థురాలు. ఇద్దరూ లోపలికి వచ్చి కూర్చున్నారు.

"జాన్ రాలేదూ?" తెలియనట్టు అడిగింది మిసెస్ జాన్.

"ఊహు. పనుండి, అరగంట అలస్యంగా వస్తానని టెలిఫోను చేశారు." సుజాత ఎదుట అబద్ధం ఆడాల్సి వచ్చినందుకు తనని తనే తిట్టుకుంటూ అన్నాడు హేస్టన్.

మిసెస్ జాన్ సర్దుకుని కూర్చునేటంతలో బాయ్ వచ్చి ఇంటివద్ద నుంచి ఫోన్ వచ్చిందని చెప్పాడు. మిసెస్ జాన్ హేస్టన్ వైపు చూసి అవతల గది లోకి వెళ్ళింది. అతను టైం చూసుకున్నాడు. సరిగ్గా ఆరున్నరకి హొటల్ వైకుంఠానికి ఫోన్ చెయ్యమని చెప్పి వచ్చింది. క్రమశిక్షణ కలిగి యజమాని చెప్పింది అక్షరాల పాటించే నౌకరు శ్రద్ధతో ఠంచనుగా 6.30కి ఫోను చేశాడు. మిసెస్ జాన్ అవతలి గదిలోనుంచి ఆదుర్దా అంతా మొహం నిండా నింపుకుని "సారీ సుజాతా! మా అబ్బాయి సైకిల్ మీదనుంచి క్రిందపడ్డాడు. దెబ్బలు తగిలాయిట, నేను వెళ్ళాలి" అంది.

"నేను కూడా వస్తాను." కూర్చున్న సుజాత చటుక్కున లేచి సోఫా చేతి మీద పడేసిన షాల్ అందుకోబోయింది.


"నో నో! అవసరం లేదు. నేను కూడా ఒక్క అరగంటలో తిరిగివస్తాను. అసలింతలో జాన్ రానే వస్తారు. మీరిద్దరూ మాట్లాడుకుంటూ ఉండండి" లేచిన సుజాత రెండు భుజాల మీద చేతులు వేసి బలంగా సోఫాలో కూలదోసి హేస్టన్‌వైపు తిరిగి "ఏం హేస్టన్?" అంది. అతను అంగీకార సూచకంగా తలూపాడు.

మిసెస్ జాన్ వెళ్ళిపోయింది. హేస్టన్ గుండె ఏ క్షణంలో గతి తప్పుతుందో అన్నంత వేగంగా కొట్టుకోసాగింది. అతని చూపులు సోఫాలో పొందికగా మలచిన శిల్పంలా కూర్చున్న సుజాతను పట్టి దగ్గరకు లాక్కుని గుండెలో దాచుకోవాలి అన్నట్టు చూస్తున్నాయి. ఇద్దరిమధ్య నిశ్శబ్దం ఏర్పడింది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదించడానికి ఎవరికీ ధైర్యం చాలటం లేదు. దూరంగా ఉవ్వెత్తున లేచిపడ్తున్న కెరటాలతో నది ఉండి, ఉండి బిగ్గరగా అరుస్తోంది. ఎర్రటి హంసలబారున్న తెల్లటి సిల్కు చీర, పాదాల వరకూ జీరాడ్తున్న కుచ్చిళ్ళతో మంత్రముగ్ధలా మాటలు రానిదానిలా కూర్చుని చీర అంచుని చేత్తో సరిచేసుకుంటూ ఉన్న సుజాతని చూస్తూంటే హఠాత్తుగా అతనికి కాన్వాసు, రంగులు, కుంచెలు కావాలనిపించింది. ఏ మత్తు ద్రవాలూ త్రాగకుండానే - సుజాత అందం చూస్తూంటేనే అతని కళ్ళు మత్తుగా అన్పిం

చాయి. ఎంత అపురూపమైన సౌందర్యం! సౌందర్యంలో ఆ నిశ్చలత్వం మరింత ఆకర్షణీయంగా వుంది. ఇలాంటి సౌందర్యాలు వెలుగుతున్న మంటల్లాంటావి. వీటివైపు దూరం నుంచి చూడాలే తప్ప దగ్గరగా వెళ్ళి చేయి చాచకూడదు. హేస్టన్ జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు. ఎలా మొదలుపెట్టాలి? ఏమని చెప్పాలి? తను చెప్పబోయేది విన్న తర్వాత సుజాత ఏమంటుంది? క్షణాలు గడిచిపోతూనే ఉన్నాయి. టైమ్ జర జర పాకిపోతూ వుంది. హేస్టన్ వెళ్ళి మంచం పక్కగా గోడవారన టేబిల్ మీద నున్న కాఫీ తీసి కప్పులో పోసి తెచ్చి సుజాత కందించాడు. కళ్ళెత్తి అతనివైపు చూసే సాహసం కోల్పోయిన సుజాత మౌనంగా కప్పు అందుకుంది. ఇద్దరి చేతులు సాసర్ని చెరో చివర పట్టుకున్నాయి.

"ఎంత అందంగా ఉంది చెయ్యి! పొడుగాటి ఆ వేళ్ళని చూస్తేనే మంచి ఆర్టిస్టు అని తెలుస్తుంది" అనుకుంది సుజాత.

"కొద్దిగా వంచుకున్న ఆ తల ఎంత బాగుంది! అందమైన ఆ తలని లాక్కుని... ఒక్కసారి దగ్గరకు లాక్కుని ఆ పాపిడి మధ్య గడ్డం ఆన్చుకోవా" లనిపించింది హేస్టన్‌కి. క్షణంసేపు కాఫీ కప్పు వదిలేసి సుజాత భుజాల చుట్టూ చేయి వేసి దగ్గరకు తీసుకోవాలని బలంగా అన్పించింది. కాని నిశ్చలంగా కూర్చున్న సుజాతలోని పాషాణంలాంటి పవిత్రత ఏదో అతన్ని దూరంగా నిలబెట్తోందిగాని దగ్గరకు రానివ్వటం లేదు. హేస్టన్ కప్పు వదిలేశాడు. సుజాత కాఫీ తాగలేదు. పక్కన స్టూలు మీద పెట్టేసింది. ఇంక భరించలేని హేస్టన్ జేబులోంచి డైరీ తీసి ఫోటో సుజాతకిచ్చాడు. క్షణంసేపు హేస్టన్ చెయ్యి కంపించింది. ఫోటో చూస్తూనే ఉలిక్కిపడింది సుజాత. ఐదు సంవత్సరాల క్రితం విశాఖపట్నంలో బాబాయి కూతురు విశాల కోసం తను ప్రత్యేకంగా తీయించుకుని పంపిన ఫోటో! ఇది అతని చేతికెలా వచ్చింది? అయోమయంగా, అర్థంగాని దానిలా హేస్టన్ మొహంలోకి పరీక్షగా, ప్రశ్నార్థకంగా చూసింది. అవే కళ్ళు; నల్లటి సోగకళ్ళు; ఆ కళ్ళు, పెదవులు, ఆ బుగ్గలు, ఎత్తయిన ఆ మొహం హేస్టన్‌కి 5 సంవత్సరాల నుంచి పరిచయం.



"ఆ ఫోటో మీదే కదూ?" ఎలాగయితేనేం అతని నోటి నుంచి మాట వెలువడింది.

"అవును!" సుజాత కళ్ళల్లో సంభ్రమాశ్చర్యాలు కన్పించాయి. అది గ్రహించిన హేస్టన్ ఫోటో తిరిగి తీసుకుని దానివైపు చూస్తూ, "ఇలాంటి విచిత్రం ప్రపంచంలో ఎక్కడా జరగలేదేమో - మీకు నేనో కథ చెప్తాను వింటారా?" అన్నాడు. సుజాత వింటూన్నట్టు పసిపిల్లలా తలూపింది. అతను మొదలుపెట్టాడు. మధ్యలో గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు. తర్వాత గుమ్మం దగ్గరకు వెళ్ళి సుజాతవైపు వీపు పెట్టి తనకి తను చెప్పుకుంటున్నట్లు కొంచెంసేపు పిచ్చివాడిలా రెప్ప వాల్చకుండా సుజాతవైపు చూస్తూ సిగరెట్ మీద సిగరెట్ ఆపకుండా వెలిగిస్తూ ఎలాగయితేనేం చెప్పటం ముగించాడు. ముగిస్తూ "ఇప్పుడు చెప్పు. రావు భార్యగా అన్ని సంవత్సరాల ఆ గౌరవం కంటే ఈ కొద్దికాలంలో ఈ ఆరాధన నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది. ఇంతవరకూ నువ్వు కన్పించకపోతే మతి పోతుందనుకున్నాను. ఇప్పుడు నిన్ను చూస్తుంటే మతిపోతోంది. మతి పోగొట్టుకోనటం కంటే ఈ పరిస్థితుల్లో యింకేం చెయ్యాలో నాకు తోచటం లేదు" కుర్చీలో కూలబడిన హేస్టన్ బాధగా అరిచేతుల్లో మొహం రుద్దుకుంటూ కళ్ళు మూసుకుని అన్నాడు. సోఫాలో నిటారుగా కూర్చుని రెప్ప వాల్చటం మర్చిపోయి వింటున్న సుజాతకి అసలు తనెక్కడుందో, ఏం చేస్తుందో తెలియకుండా పోయింది. మంద్రస్థాయిలో విన్పిస్తున్న అతని కంఠస్వరం, ఈ ఫోటో, దాని కథ, అన్నీ హఠాత్తుగా పెనుతుఫానులా చుట్టేసి అసలు తన ఉనికి, ఎక్కడో తెలియచేయకుండా చేసేసినాయి.

"థాంక్ గాడ్! నువ్వు చదువుకున్నదానివి. నా భాష నీకర్థం అవటం నా అదృష్టం. నా బాధ నీకీపాటికి తెలిసి వుంటుంది. నేనేం చెయ్యాలి చెప్పు?" గదిలో మళ్ళీ పచార్లు చేస్తూ అన్నాడు. సుజాత జవాబివ్వలేదు. హేస్టన్ మళ్ళీ తనే అన్నాడు.

"ఇందులో ని ప్రమేయం ఏమీ లేని మాట నిజమే. జరిగిందానికి నువ్వే మాత్రం బాధ్యురాలివి కావు అన్న సంగతి నాకు తెలుసు. కాని నావైపు ఆలోచించు..." మాట్లాడుతున్నహేస్టన్ హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చినవాడిలా చేతి వాచీ చూసుకుంటూ, "గాడ్! టైమైపోయింది, మిసెస్ జాన్ వచ్చేస్తుంది" అంటూ, హఠాత్తుగా సుజాతకి దగ్గరగా వచ్చి, "నేను రెండు రోజుల కంటే ఎక్కువ ఉండటానికి వీల్లేదు. వెళ్ళేలోపల మరొక్కసారి కలుసుకుంటానని వాగ్దానం చెయ్యి, చెయ్యవూ?" అన్నాడు. అయోమయంగా వున్న సుజాత అలాగేనని తలూపింది.

ఇంతలో వాకిట్లోంచి "హేస్టన్!" అన్న మిసెస్ జాన్ పిలుపు వినిపించింది. హేస్టన్ చప్పున వచ్చి సుజాత కెదురుగుండా వున్న సోఫాలో కూర్చున్నాడు. సుజాత సర్దుకుని మామూలుగా కూర్చుంది. మిసెస్ జాన్ లోపలికి వచ్చింది. ఆవిడ వెంట మిస్టర్ జాన్ కూడా ఉన్నాడు. ఆయన వస్తూనే గదిలో నిశ్చలంగా నిర్వికారంగా కూర్చున్న ఇద్దర్నీ ఆరాగా మొహాలవైపు పరీక్షగా పరికించాడు. ఇద్దరూ మామూలుగా ఉన్నారు.

సుజాతకిప్పుడు అర్థం అయింది. అది కేవలం కావాలని జాన్ వాళ్ళు తామిద్దరూ ఏకాంతంగా కలుసుకోవటం కోసం ఏర్పాటు చేసిందని. కానీ ఎందుకో సుజాతకు కోపం రాలేదు. ఇంటికొస్తూనే మంచం మీద పడి దిండులో తల దాచుకుంది. అంతా ఏదో విచిత్రంగా ఎక్కడో స్వప్న లోకంలో ఉన్నట్లుంది. వైకుంఠానికి వెళ్ళబోయే ముందు తనకి, వెళ్ళివచ్చిన తనకి ఎంత భేదం! ఎవరీ హేస్టన్? తన ఫోటో అతని చేతుల్లోకి వెళ్ళటం ఏమిటి? తనకు తెలియకుండా అతనిలో అంత తుపాను సృష్టించటమేమిటి? కాదు కాదు. హేస్టన్‌ని తనలో ఆకర్షించింది తన సౌందర్యం కాదు. ఇదేదో పూర్వ జన్మ సంబంధం అయి వుండాలి. ఈ పరిచయం తన జీవితం మీద ఎలాంటి ముద్ర వేయబోతోందో! క్షణంసేపు అర్థంగాని భయంతో సుజాత శరీరం కంపించింది. లేదు లేదు. ఎలాటి ముద్రా పడదు. ఒక అనుభవంగా తీసుకుని మర్చిపోతుంది తను. కానీ మర్చిపోవటం అంత సులభమా? అంత తేలికగా తను మర్చిపోగలదా? మరొకసారి వెళ్ళిపోయేలాగా కలుసుకుంటానని వాగ్దానం చేసింది తను. అలా ఎందుకు చేసింది? సుజాత కళ్ళ ముందు హేస్టన్ రూపమే కదుల్తోంది. చెవుల్లో ఇంకా ఆ మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ రాత్రి అలా ఆలోచిస్తూండగానే తెల్లవారిపోయింది. నిద్రలో కూడా అతని కళ్ళలోని కళాత్మకతని సుజాత నివ్వెరగా చూస్తోంది.

హేస్టన్ కూడా నిద్రపోలేదు. మాటిమాటికి సుజాతే గుర్తుకు రాసాగింది. కొద్దిగా దొరికిన ఈ వ్యవధిలో ఒక విషయం మటుకు స్పష్టంగా తెలిసిపోయింది. అది - సుజాత తను కట్టుబడిపోయిన బంధాలు తెంచుకోదు. తెంచుకునే మనిషి కాదు. లేకపోతే అలాంటి నిశ్చలత్వం రాదు. అయినా ఇదేమిటి? మొదటినుంచీ సుజాత ఫోటో తనని యిలా పిచ్చివాడ్ని చేస్తోందెందుకు? రావు భార్య అని తెలిసినప్పుడు చూడాలనిపించింది. కాదని రుజువైనప్పుడు గట్టిగా చూసి తీరాలని మరింత బలంగా అన్పించింది. అసలు కన్పించదేమోననే అనుమానం వచ్చినప్పుడు కనీసం దూరం నుంచి చూస్తేనన్నా చాలు తృప్తిపడవచ్చు అనుకున్నాడు. కాని ఆ తృప్తి యిప్పుడేది? దూరం నుంచి చూస్తుంటే దగ్గరకు లాక్కోవాలనిపిస్తుంది. ఏమిటీ అనుబంధం? సుజాత కంటె అందమైనవారు తనకి అమెరికాలో దొరకరూ? ఈ అమ్మాయి మొదటినుంచీ యిలా తనవైపు ఆకర్షించుకుంటోంది ఎందుకో?

మర్నాడు జాన్ దంపతులు హేస్టన్ కలిసి హంపీ శిథిలాలు చూడటానికి వెడుతున్నామని, సుజాతని రమ్మనమనీ కబురు చేసింది మిసెస్ జాన్. "క్షమించండి. రాలేను." చిన్న చీటీ మీద ఆ రెండు ముక్కలు రాసి పంపింది సుజాత. అంతవరకూ తప్పకుండా వస్తుందని ఎంతో ఎదురుచూస్తున్న హేస్టన్ తెల్లబోయాడు. మిసెస్ జాన్ ఏం చెయ్యటమన్నట్టు అతనివైపు ప్రశ్నార్థకంగా చూసింది. "వద్దు - ప్రోగ్రాం డ్రాప్ చేసుకుందాం" అని హేస్టన్ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

వైకుంఠానికి తిరిగి వచ్చేసిన అతనికి ఏం తోచలేదు. అదేమిటి? సుజాత

భయపడిందా? తనని అర్థం చేసుకోలేదూ? క్షణంసేపు ఏదో ఆలోచించిన హేస్టన్ టేబిల్ దగ్గరకెళ్ళి కాగితం తీసుకుని ఇలా రాశాడు:


"సుజా! మరోసారి కలుసుకుందామని వాగ్దానం చేశావు. ఈరోజు రాలేదేంటి? ఒక్కసారి కన్పించు. నేను వెళ్ళిపోవటమే నీ ఆదేశం అయితే తప్పకుండా వెళ్ళిపోతాను. కాని వెళ్ళేముందు నీదగ్గర సెలవు తీసుకోందే మటుకు నేనిక్కడినుంచి కదలలేను. ఎప్పుడొచ్చేది తెలియజేయ్.

హేస్టన్."

వైకుంఠం తాలూకు నౌకరు కర్రాడు తెచ్చి యిచ్చిన ఉత్తరం చూసుకుని ఖంగారుపడింది సుజాత. మరోసారి అతనితో కలిసి మాట్లాడటం తనకే మాత్రం మంచిది కాదని, వద్దని మనసు చెప్తోంది. కాని తప్పదు. సాయంత్రం వస్తాననీ, ఆరు గంటలకు పార్కు దగ్గరకు వచ్చి నిలబడతానని, వచ్చి తీసుకెళ్ళమని జవాబు రాసింది.

రాసి పంపడం పంపింది కానీ మళ్ళీ భయం! పార్కు దగ్గర ఎవరయినా చూస్తే దీని పర్యవసానం ఏమిటి? అలాగని వెళ్ళకుండా ఉందామా అంటే తిరస్కరించటానికి మనసు ఒప్పుకోవడం లేదు. ఇంటికీ పార్కుకీ నాలుగు ఫర్లాంగులు కూడా లేదు. సుజాత అదృష్టం. ఆరోజు ఉదయం నుంచి మబ్బు మబ్బుగా వున్న వాతావరణం సాయంత్రం అయ్యేసరికి కారు చీకటిలా మూసుకుపోయి కుండపోతలా వర్షం కురవటం మొదలుపెట్టింది.

వాన రాబోతుండటం వల్ల కాబోలు, వీధుల్లో ఎవరూ మనుష్యులు రారు. పార్కు కూడా నిర్మానుష్యంగా ఉంది. టపటపమని రాలుతున్న పెద్ద పెద్ద చినుకుల్లో సుజాత భుజాలచుట్టూ షాల్ వేసుకుని బయటకు వచ్చింది.



సుజాత పార్కు దగ్గరకు వస్తూనే ప్రక్కన నిలబడి వున్న కారుని చూసింది. సుజాతను చూస్తూనే కారు స్టార్టు చేసి డోర్ తెరిచాడు హేస్టన్. సుజాత కూర్చోగానే కారు కదిలింది. ఎంత ధైర్యం తనకి! ముక్కు మొహం తెలియని ఈ అమెరికన్ పిలిస్తే రావటం - ప్రక్కన కూర్చోడం ఎంత సాహసం! ఒంటి మీద స్పృహ ఉండే చేస్తోందా - అన్పించింది. కానీ రాకుండా వుండలేకపోతోంది.

5 నిమిషాల్లో నిలువుగా ఉన్న కొండని చుట్టుకుంటూ పైకి వచ్చేసింది కారు. వాన బాగా పడ్తుంటం వల్ల బయట మనుష్యులెవరూ లేరు. ఇద్దరూ దిగి లోపలికి వచ్చారు. సుజాత నిన్న కూర్చున్న కుర్చీలోనే కూర్చుంది. హఠాత్తుగా మళ్ళీ కాలం ఆగిపోయినట్టు తోచింది. ఏం మాట్లాడాలో, ఎలా మొదలుపెట్టాలో హేస్టన్‌కి తోచలేదు. మళ్ళీ నిన్నటి సమస్యే! సుజాత నిశ్శబ్దంగా నిర్వికారంగా అన్పిస్తోంది. అతనే ప్రశ్న అడిగినా జవాబివ్వగలదని తోచింది. ఇద్దరిమధ్య నిశ్శబ్దం ఏర్పడింది.

ఉరుములు, మెరుపులతో ఆకాశం చిల్లుపడ్డట్లు వర్షం కురుస్తోంది. మధ్య దూరం నుంచి ఉధృతంగా ఉరుకుతూ, ఉరకలు వేస్తున్న నది ఉండి ఉండి భయంకరంగా అరుస్తోంది. కిటికీ దగ్గరగా వచ్చిన హేస్టన్ బయట వింతగా గర్జిస్తున్న ప్రకృతివైపు రెప్ప వాల్చకుండా పరీక్షగా చూస్తున్నాడు. అతను నిలవటంలో, అలా బయటకు చూడటంలో ఏదో నిస్సహాయత గోచరిస్తూంది. కిటికీ దగ్గరగా నిలబడ్డ హేస్టన్ కదలి గది మధ్యగా వచ్చాడు. అతని ప్రతి కదలికని సుజాత కన్నులు పరీక్షగా గమనిస్తున్నాయి.

"చివరిసారిగా అడుగుతున్నాను, చెప్పు సుజాత! నేను వెళ్ళిపోవటమే మనిద్దరికీ శ్రేయస్కరం అంటావా?"

హేస్టన్ వయిపు చూస్తున్న సుజాత చూపులు చప్పున వేలి ఉంగరం మీదకు మరల్చుకుంది. అతని ప్రశ్నకు తను చెప్పబోయే జవాబు స్పష్టంగా తెలిసికూడా అలా ఎందుకు అడగటం! ఆ ప్రశ్న బాకులా తన గుండెల్లో గుచ్చుకుంటుందని అతనికి తెలియదూ!

"పోనీ, స్నేహితుడిగా ఉత్తరాలైనా రాయొచ్చా?"

వద్దన్నట్టు తలూపింది సుజాత. అది కూడా కాదు. అదీ నిజమే. తమ స్నేహాన్ని సుజాత భర్త సవ్యంగా అర్థం చేసుకోకపోతే! అలాటి సమస్యలన్నీ తలెత్తకముందే - అందుకే మొగ్గలోనే ఈ పరిచయాన్ని తుంచేస్తుంది.

"నేను వెళ్ళిపోవటమే నీ ఆదేశం అయితే తప్పకుండా వెళ్ళిపోతాను. కానీ... కానీ" హేస్టన్ మధ్యలోనే ఆగిపోయాడు. భగవాన్! తనసలు ఇండియా ఎందుకొచ్చాడు? బాధాపూరితమైన ఈ స్మృతి మనసులో ముద్ర వేసుకుని వెళ్ళటానికా? అసలు ఫొటోలో వ్యక్తి రావు భార్య కాదని తెలిసినప్పుడే ఆ ఊహని చంపెయ్యక దానికి ప్రాణం పోసి పెంచి, ఏవో రంగులు కలిపి అపూర్వమైన అనుభవాన్ని ఎందుకు ఊహించుకున్నాడు? ఆ అనుభవం దొరికిందిగాని దీని రంగుల నీడలు వేరుగా ఉన్నాయి. సోఫాలో కూలబడి వెనక్కు వాలి కళ్ళు మూసుకున్న హేస్టన్ "నేనేం చెయ్యాలి? నువ్వు లేకుండా అమెరికా వెళ్ళటం నాకు అసంభవమని తోస్తోంది" అన్నాడు. సుజాత తృళ్ళిపడింది. హేస్టన్ కన్నులు మూసుకుని ఉండటం వల్ల అది గమనించలేదు. అతని శరీరం ఆమె ముందు మోకరిల్లి ఒడిలో తలదాచుకుని శాంతి పొందాలని తపించిపోతోంది.

"నీ ప్రమేయం లేకుండా, నీకు తెలియకుండా నీ ఫొటో వల్ల జరిగిన మాట వాస్తవమే. 'నీ బాధకి నేను బాధ్యురాల్ని కాను' అని నువ్వు ఒక్క మాటలో తీసిపారెయ్యొచ్చు కాని..."

"కాదు - కాదు, ఇది చాలా తాత్కాలికం. మీరు అమెరికా వెళ్ళగానే మర్చిపోతారు. అప్పుడింత బాధ అనిపించదు. స్మృతి మందిరంలో అందమైన చిన్న వస్తువుగా ఈ జ్ఞాపకం మిగిలిపోతుంది. అంతే."

"మర్చిపోవటమా?... నేనా? ఎప్పటికీ అసంభవం! పోనీ, కనీసం ఇదయినా చెప్పు. ఈ జీవితం నీకు చాలా సుఖంగా హాయిగా వుందా?" ఒక్కొక్క ప్రశ్న బాకు. సుజాత హృదయానికి గురిచూసి విసురుతున్నట్టు అడుగుతున్నాడు.

ఎలాగో తమాయించుకుంది సుజాత. నిన్నటివరకూ అసలు జీవితం ఏమిటో తనకు తెలుసా? అందమైన అనుభవం అంటే ఏమిటో అర్థం తెలుసా? పుట్టింది, పెరిగింది, పెళ్ళి చేసుకుంది అంతే!

"చెప్పు, నువ్వు సుఖంగా ఉన్నావంటే నా బాధ నాకు తృప్తిగానయినా కన్పిస్తుంది." కన్నులు తెరిచి సుజాత వైపు చూస్తూ అన్నాడు హేస్టన్. సుజాత కళ్ళెత్తి చూసింది. యిద్దరి చూపులూ కలుసుకున్నాయి. తన బాధ ఈ అమ్మాయి గుర్తించింది. తన గుండెల్లో తిరుగుతున్న సుళ్ళకి ఆ కళ్ళల్లో ప్రతిస్పందన వుంది. కాని పలకదు! తనచుట్టూ గిరి గీసుకుని ఆ గిరి మధ్య రాయిలా కూర్చుంది. ఎటువైపునా తను ప్రవేశించలేడు. అదే హేస్టన్ని పిచ్చివాడ్ని చేస్తూంది.

"జవాబు చెప్పవూ?" మౌనంగా కూర్చున్న సుజాతవైపు చూసి పసిపిల్లాడిలా అడిగాడు.

"సుఖంగా లేక నాకిప్పుడేమయింది?" మృదువుగా మెల్లగా అన్నది సుజాత. దెబ్బతిన్నట్టు చూశాడు హేస్టన్. ఆ మాటలో యిద్దరి మధ్య ఎంత దూరం! జాతి, మతం, రంగు, వీళ్ళ దేశం వీటన్నిటిని సుజాత సున్నితంగా చూపిస్తుంది.

"అడగాలనుకున్న మాటలకి మొదట్లోనే నోరు మూయించారు" హేస్టన్ లేచి కిటికీవైపు వెళ్ళిపోయాడు.

రెండు నిమిషాల తర్వాత కిటికీ దగ్గర నిలబడ్డ హేస్టన్ వెనక్కు తిరిగి చూశాడు. "ప్లీజ్ దయవుంచి సాధ్యమయిన త్వరలో ఇక్కడనుంచి వెళ్ళిపోండి. ఇప్పటికే నేను సగం పిచ్చిదాన్నయ్యాను!" సుజాత చప్పున అరచేతులతో మొహం దాచుకుని సోఫా చేతిమీద వాలిపోయింది.

క్షణంసేపు కంగారుపడిన హేస్టన్ గబా గబా సుజాత కూర్చున్న సోఫా దగ్గరకు వచ్చాడు. బాధగా తలదాచుకున్న సుజాతని ప్రక్కన కూర్చుని ఒళ్ళోకి తీసుకుని బుజ్జగించాలనిపించింది. ఛీ చీ! తనవల్ల ఈ అమ్మాయి బాధపడకూడదు.


"సుజాతా!" హేస్టన్ పిలవటం తప్ప మరేం చెయ్యలేకపోయాడు. సుజాత తలెత్తింది. థాంక్ గాడ్! ఏడవటం లేదు. కాని కళ్ళల్లో మటకు భరించలేని బాధ కన్పిస్తోంది. హేస్టన్ చేతి వాచీ చూసుకుంటూ "నేనీ రాత్రే

వెళ్ళిపోతాను. కాని -" మధ్యలో ఆగిపోయి మళ్ళీ కిటికీ దగ్గరగా వెళ్ళిపోయాడు. టైమైపోతోంది. జీవితంలో ఎవరికీ లభ్యంగాని అసాధారణమైన అనుభవం తాలూకు ఆఖరి ఘడియలు అయిపోతున్నాయి. క్షణాల్ని కాలం మృత్యువులా ఆత్రంగా కబళించేస్తోంది. కిటికీ చువ్వలకి తల ఆన్చుకొని కళ్ళు మూసుకున్న హేస్టన్‌కి ఈ క్షణం శాశ్వతం అయిపోవాలనిపించింది. ఇన్ని సంవత్సరాల జీవితంలో ఇంతకు ముందెన్నడూ అతనికింత బాధ అన్పించలేదు. ఈ బాధ కొత్తగా హృదయాన్ని రంపపుకోత కోస్తున్నట్లున్నది. అయినా తను విల విల లాడటం లేదు. నిశ్శబ్దంగా భరిస్తున్నాడు. అదే చిత్రం. కిటికీలోంచి వచ్చిన వానజల్లు మొహం మీద పడటంతో ఉలిక్కిపడ్డ హేస్టన్ లేచి వెనక్కు తిరిగి చూశాడు. కుర్చీలో బొమ్మలా కూర్చున్న సుజాత కళ్ళలో మూర్తీభవించినట్టున్న అధైర్యం, ఆ నిస్సహాయత చూస్తుంటే అతని గుండెలు ఎవరో బలంగా మోదినట్టు అనిపించింది.

"క్షమించు సుజా! నా ఈ హఠాత్తు రాకతో, ఈ ఫోటో గొడవతో చాలా బాధ కలిగించినట్టు ఉన్నాను." మళ్ళీ గది మధ్యగా వస్తూ అన్నాడు. "మొన్న పార్టీలో పాలరాతి బొమ్మలా వెయ్యి వెన్నెలల్లో విరిసే మెరుపులాటి చిరునవ్వుతో ఉన్న సుజాత వేరు, ఈరోజు నిశ్శబ్దంగా మూగగా లోపల్లోపల బాధ అనుభవిస్తూ పైకి గంభీరంగా కూర్చున్న సుజాత వేరు."

"క్షమించవలసింది మీరు, నా పరిచయాన్ని కలలా తీసేసి మర్చిపోండి."

"సుజా!" మధ్యలోనే బిగ్గరగా పిల్చాడు అతను. "కలలా తీసేయ్యవలసింది నువ్వు. చాలు, నన్ను అర్థం చేసుకున్నావనుకున్నాను. టైమైపోతోంది పద. నిన్ను దించి వచ్చేస్తాను." కారు కీ కోసం ఆవేశంగా టేబుల్ దగ్గరకు వెళ్ళబోతున్న హేస్టన్ కళ్ళెత్తి తనవైపు చూసిన సుజాత వైపు చూస్తూ మధ్యలోనే ఆగిపోయాడు. ఈ అమ్మాయి చూపులకి ఎదుటివాళ్ళని వేసిపట్టేలాగే కళ్ళాలున్నాయి. హఠాత్తుగా ఆగిన అతను ఏదో గుర్తుకు వచ్చినవాడిలా ఒకడుగు సుజాతవైపు వేసి "ఎలాగూ విడిపోతున్నాం. మరి కలుసుకుంటాం అనే ఆశ కూడా లేదు. నీ గుర్తుగా ఏదైనా నాకివ్వు" అన్నాడు.



"ఇవ్వటానికి నాదగ్గిర ఏముంది?" నిస్సహాయంగా చూసింది సుజాత.

"ఇదుగో, ఇది" సోఫా చేతిమీద పడేసిన షాల్‌ని తీసుకొని దాన్ని పరీక్షగా చూస్తూ అన్నాడు.

"అదా? అది క్రిందటిసారి నా పుట్టినరోజుకి నా భర్త నాకు ప్రేమగా హైద్రాబాద్ నుంచి తెప్పించినది!"

షాక్ తిన్నవాడిలా చప్పున షాల్‌ని సోఫా చేతిమీద వదిలేసి అతను వెర్రివానిలా సుజాతవైపు చూశాడు.

"మా దేశంలో పెళ్ళి అయింది అంటే ఆడపిల్ల జీవితంలో ఆఖరికి పీల్చే ఊపిరి కూడా భర్తదే అయి వుంటుంది." చేతివేలికున్న ఉంగరాన్ని సరిచేసుకుంటూ అంది సుజాత. సుజాతకు హఠాత్తుగా ఆ ఉంగరం తనదేనన్న సంగతి గుర్తుకు వచ్చింది. అది మంచి మార్కులతో బి.ఏ. పాసయినప్పుడు "యస్" అనే అక్షరం ఎనామిల్ రంగులో చెక్కించి తాతయ్య చేయించి ఇచ్చాడు. ఉంగరం తీసుకుని అరచేతిలో పట్టుకున్న సుజాత మళ్ళీ ఆగిపోయింది. గుర్తువస్తే అతనికీ బాధేగా! ఏ ముద్రా లేకుండా అతను వెళ్ళిపోతే అతను కొంత కాలం తర్వాతనయినా తనని మర్చిపోవచ్చు. లాభం లేదు ఇక్కడినుంచి ఎంత త్వరగా ఇంటికి వెళితే అంత మంచిది. ఇలా మరికొన్ని గంటలు గడిస్తే, బాధాపూరితమైన అతని మాటలు వింటూంటే తనేం చేస్తుందో తనకే తెలియదు. శక్తిని అంతా కేంద్రీకరించి కూడగట్టుకున్నా మనసు ఎదురుతిరిగి వశం తప్పుతోంది.

ఉంగరం అలా చేత్తో పట్టుకునే లేచి నిలబడింది సుజాత. పోనీ ఉంగరం ఇచ్చేస్తే? దూరంగా నిలబడిన అతనివైపు ఉంగరం వున్న అరచేతిని చాచింది. ముఖంలో గబగబా రంగులు మారుతున్న సుజాత మొహం వంక రెప్ప వాల్చకుండా చూస్తున్న అతను సుజాత యిస్తున్నదేమిటో క్షణంసేపు అర్థం కాక ఒకడుగు ముందుకు వేశాడు. సుజాత చేతిని మరికొంచెం ముందుకు చాచింది. అంతే! ఆకాశం ఒక్కసారి భయంకరంగా గర్జించింది. ఫెళఫెళమని పెద్దగా శబ్దం చేస్తూ దూరాన ఎక్కడో పిడుగు పడింది. వెంటనే లైట్లు పోయాయి. అతని చేతులు సుజాత భుజాలు పట్టి దగ్గరకు లాక్కున్నాయి. అంతా చీకటి ఆకాశంలో భయంకరమైన చప్పుళ్ళు, జోరుగా వర్షం, దూరాన వుండి వుండి భయంకరంగా నది అరుస్తున్నది. కిటికీలోంచి తళుక్కున మెరిసిన మెరుపుకి సుజాత - అతని, ఇద్దరు కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఇద్దరూ తమ ఉనికిని మర్చిపోయి ప్రకృతి బీభత్సాన్ని చూస్తుండిపోయారు. అంతలోనే లైట్లు వెలిగాయి. హేస్టన్ చేతుల మధ్య ఒదిగిపోయిన సుజాత "ఉంగరం - ఉంగరం" అంది. సుజాత చెపుతున్నదేమిటో అర్థం గాని హేస్టన్ తను అప్రయత్నంగా చేసిన పని గుర్తుకొచ్చి చప్పున సుజాతని వదిలేసి దూరంగా వెళ్ళిపోయాడు. అతని నరనరంలోనూ విద్యుత్ పాకినట్టుగా వుంది.

"ఉంగరం!" ఇంగ్లీషులో చెప్పింది సుజాత.

"ఉండనీ - ఉదయం జాగ్రత్తగా పంపిస్తాను" ఇద్దరూ కలిసి బైటకొచ్చేశారు. "అరె, కారు కీ మర్చిపోయి వచ్చాను" మధ్యలో ఆగి హేస్టన్ వెనక్కి వెళ్ళిపోయాడు. గది ముందున్న వరండాపైన వెలుగుతున్న ట్యూబ్‌లైటు కాంతి వెన్నెలలా అక్కడంతా ఆవరించుకుని కంటికి ఆహ్లాదంగా వుంది. ఆ కాంతిని వదిలి కళ్ళెత్తి అలా బయటకు చూస్తే అంతా చీకటి. ఇకముందు తను గడపబోయే చీకటిలాంటి జీవితంలో హేస్టన్ ఇలా వెన్నెలలా గుర్తు వస్తాడు. అంతే! ఈ అనుభవం తనకి అలాగే మిగిలిపోతుంది. కొద్దిరోజుల పరిచయం అతన్ని పిచ్చివాడిని చేస్తే, కొద్ది గంటల పరిచయం తనని వెర్రిదానిని చేస్తోంది.

"భగవాన్! ఏ ఆడపిల్ల జీవితంలోనూ ఇలాంటి సంఘటనలు వద్దు" కళ్ళు మూసుకుని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్న సుజాత వెనక అలికిడి అవటంతో తలతిప్పి చూసింది.వెనకగా వచ్చినహేస్టన్, గదిలో సుజాత మర్చిపోయి వచ్చిన షాల్ తెచ్చి భుజాల చుట్టూ కప్పి, ఆ భుజాలు పట్టుకుని పూర్తిగా తనవైపు తిప్పుకుంటూ "సుజా! నేనంటే ఏ భావం లేకపోతే మానె - కనీసం నాపట్ల సానుభూతయినా నీకు లేదూ?" అన్నాడు. సుజాత పెదవులు కంపించాయి. కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. అస్పష్టంగా ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్న సుజాతను వారిస్తూ, "అక్కర్లేదు. నువ్వు నోటితో చెప్పనక్కరలేదు. నాకిప్పుడు అర్థం అయింది. పద పొద్దు పోతోంది" అన్నాడు.

ఇద్దరూ కారులో కూర్చున్నారు. వాన ఉధృతం తగ్గినా ఇంకా జోరుగా పడుతూనే వుంది. కారు నిలువుగా వున్న కొండని చుట్టుకుంటూ క్రిందకు వస్తోంది. దూరంగా డామ్‌కి కుడివైపు మిలమిలా మెరుస్తున్న దీపాలు - మధ్య పూసల తోరణాల్లా రాల్తున్న వర్షపు ధారలు. ఇద్దరిమధ్య నిశ్శబ్దం ఏర్పడింది. కొండ దిగగానే కారు ఆపేసి చక్రం మీద తలవంచుకుని, "అయిపోయింది, అంతా అయిపోయింది. ఇన్ని రోజుల నుండి యింతగా ఎదురుచూసిన క్షణాలు అయిపోయినాయి. మీ యిల్లు రాగానే నువ్వు దిగి వెళ్ళిపోతావు. నువ్వు దిగి వెళ్ళిపోయినప్పటి నుంచి మొదలయ్యే సుదీర్ఘ నరకం ఈ జీవితంలో క్షణక్షణం తెచ్చిపెట్టుకుంటూ నేనెలా జీవించను? గాడ్!" బాధగా, బొంగురుపోయిన కంఠంతో అంటూ చక్రానికేసి తల రాసుకుంటున్న అతన్ని చూస్తుంటే సుజాతకి చేయి చాచి ఆ తలని ఒక్కసారి తాకి దగ్గరకు తీసుకోవాలనిపించింది. కానీ కావాలని పాషాణత్వం తెచ్చిపెట్టుకుని బయటకు చూస్తూ కూర్చుంది.

"చెప్పు సుజా! నీకేం అన్పించటం లేదూ?" సుజాత చేతిని తన చేతులోకి తీసుకుంటూ అడిగాడు. సుజాత తలతిప్పి చూసింది. అతని కనుకొలకుల్లో నీళ్ళు నిండి వుండటం గమనించకపోలేదు. ఎంతో ప్రయత్నం మీద పళ్ళు బిగపట్టి ఆపుకుంటోంది. లేకపోతే తన కళ్ళ నుంచి వర్షపు ధారలే కారతాయి.

"చెప్పు సుజా!"

"నేను రాయిని కాదు!" సుజాత అంతకంటే ఏం చెప్పగలదు. హేస్టన్

మళ్ళీ డ్రైవ్ చెయ్యడం మొదలుపెట్టాడు. అతనెంత నిదానంగా డ్రయివు చేసినా కారు 5 నిమిషాల్లో పార్కు దగ్గరికి వచ్చేసింది. అక్కడికి రాగానే కారు ఆపుచేసి కళ్లు మూసుకుని మొహం పక్కకు తిప్పుకుంటూ, "నువ్వు వెళ్ళటం నేను చూడలేను. దిగి తలుపులు గట్టిగా వెయ్యి. శబ్దం విని నేను కారు స్టార్టు చేస్తాను" అన్నాడు.

రెండు నిమిషాలు గడిచాయి. మూడో నిమిషం కూడా జరుగుతోంది. సుజాత కదలలేదు, దిగలేదు. కళ్లు తెరిచిన అతను సుజాతవైపు తలతిప్పి చూశాడు. ప్రాణం లేని రాయిలా, బొమ్మలా కూర్చొని వుంది సుజాత. క్రింద పెదవి గట్టిగా నొక్కిపట్టి నిశ్శబ్దంగా వానజల్లు వయిపు చూస్తోంది. అతనికి అర్థమయింది. సుజాత తనంతట తను దిగలేదు. సుజాత వెనక నుంచి చేయి చాపి తలుపు తీశాడు. అలా తీస్తుండగా ఆఖరిసారి ఒక్కసారి అందమైన ఆ భుజాల చుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కుని సెలవు తీసుకోవాలనిపించింది. కాని సుజాత పుట్టి పెరిగిన సమాజం వేరు; దాని ధర్మాలు వేరు. ఏవిధంగానూ తెలిసి వంటిమీద స్పృహ ఉండగా ఆమెని తాకలేడు. అతను డోర్ తెరవటంలో సుజాత లేచి క్రిందకు దిగింది. దిగిన మనిషి వెళ్ళిపోవటానికి అడుగులు వెయ్యలేదు. వానలో అలాగే నిలబడిపోయి చూడసాగింది.

"వస్తా! గుడ్‌బై! గుడ్‌బై డార్లింగ్..." హేస్టన్ హఠాత్తుగా వంగి ముందుకు జరిగి సుజాత చేతిని లాక్కుని పదేపదే ముద్దు పెట్టుకుంటూ "విష్ యూ ఎ వెరీ వెరీ హేపీ లైఫ్, ఐలవ్ యూ మై డార్లింగ్! అందుకే నిశ్శబ్దంగా దూరంగా వెళ్ళిపోతున్నాను. ఐ లవ్ యూ! గుడ్ బై!" సడన్‌గా సుజాత చేతినివదిలేసి ఒక్క కుదుపుతో కారుని స్టార్టు చేసి స్పీడుగా వెళ్ళిపోయాడు. సుజాత చూస్తుండగానే అతని కారు మెరుపులా మాయమైంది. అతను వెనక్కు తిరిగి చూసినట్టు లేదు. ఇది కలా నిజమా? హేస్టన్ ముద్దాడిన చేతిమీద పడ్డ వెచ్చటి కన్నీళ్ళ మీద చల్లటి వాన బిందువులు పడ్డాయి. తనెక్కడుందో, ఏం చేస్తుందో స్పృహ కోల్పోయిన సుజాత చాలాసేపు అలా నిలువునా వర్షంలో తడుస్తూ నిలబడిపోయింది.



మర్నాడు సుజాత ఎర్రబడ్డ కళ్ళతో ప్రక్క మీదినుంచి లేవకుండా పడుకుని ఆలోచిస్తుండగానే వైకుంఠం నౌకరు కవరు ఒకటి తెచ్చి యిచ్చి వెళ్ళాడు. పైన అందంగా "సుజా" అని చెక్కినట్లు రాసి వుంది. సుజాత ఆత్రంగా కవరు చించి చూసుకుంది. అందులోంచి చిన్న ఉత్తరంతో పాటు ఉంగరం కూడా జారి ఆమె ఒళ్ళో పడింది. ఉత్తరం యిలా వుంది:

"సుజా!

అన్నీ సర్దుకున్నాను. మరో అరగంటలో నేను వెళ్ళిపోతున్నాను. నిన్ను విడిచి నేను ఒంటరిగా అమెరికా వెళ్ళటం అసంభవమే అన్పించింది మొదట. కాని రాత్రి నిన్ను చూసిం తర్వాత, ముఖ్యంగా వరండాలో స్థంభాన్నానుకున్నప్పుడు నీ స్మృతిలో మనసులో ఈ అనుభవం తాలూకు ముద్రతో ఒక్క జీవితం కాదు; వెయ్యి జీవితాలు భగవంతుణ్ణి ప్రార్థించి మరీ జీవించాలనిపిస్తుంది. నా ఈ ఉత్తరం నువ్వు చూసేసరికి నీకు నేను చాలా దూరంలో ఉంటాను.

ఉంగరం దొరికింది. దీన్ని గుర్తుగా నాతో వెంట తీసుకెళ్ళాలని మహా అనుకున్నాను. కాని నీ అనుమతి లభించదని తెలుసు. అందుకే ఇష్టం లేకపోయినా నీకు పంపిస్తున్నాను.

నువ్వు నాదానివి కాకపోయినా, కాలేకపోయినా, నేను నీవాడనే!

నీ

హేస్టన్."

ఉత్తరం చూసిన సుజాత కళ్ళలో నీళ్ళు నిండి, ఆ రోజంతా సుజాత ఏడుస్తూనే వుంది. హేస్టన్ అనుకోకుండా వెళ్ళిపోయాడని సుజాతకి చెప్పమని చెప్పాడని మిసెస్ జాన్ ఫోన్ చేసింది.

ఆ సాయంత్రం సుజాతకి ఒళ్ళు తెలియకుండా జ్వరం వచ్చింది. భర్త వూరు నుంచి వచ్చాడు. వస్తూనే జ్వరంతో ఉన్న భార్యని చూసి డాక్టర్ని పిలిపించి మందిప్పించాడు,

రెండు రోజులు గడిచినాయి. రెండు రోజుల నుంచి ఒంటిమీద స్పృహ లేకుండా పడివున్న సుజాతకి ఆరోజే కొద్దిగా జ్వరం జారింది. డాక్టర్ పర్వాలేదని, పూర్తిగా రెస్టు తీసుకోమనీ, రెండు మూడు రోజులలో బాగా తగ్గిపోతుందనీ చెప్పాడు. మూడో రోజు జ్వరం తగ్గి నార్మల్‌కి రావటంతో కొద్దిగా జావ తాగి మంచం మీద వెనక్కు వాలి దిండు నానుకుని కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది. సుజాత కళ్ళ ముందు కనిపిస్తున్న ప్రతి వస్తువులో హేస్టన్ రూపమే కనిపిస్తోంది. తనుండ లేదు. ఎవరేమనుకున్నా సరే, మిసెస్ జాన్‌ని అడిగి అడ్రస్ తెలుసుకుని అతనికి ఉత్తరాలు రాస్తుంది. స్నేహితుడిగా అతన్ని తను తీసుకుంటే ఏమౌతుంది అప్పుడు? పరీక్షగా చూస్తే అప్పుడు తెలుస్తోంది; ఇన్ని సంవత్సరాలూ ఏ అనుభూతి అనేదీ ఎరగకుండా తను జీవితం ఎలా గడిపిందో;

ఏం తోచని సుజాత వంగి మంచం పక్కనే వున్న రేడియోని ఆన్ చేసింది. మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. భర్త కాఫీ, టిఫిన్ కోసం యింటికి వచ్చే సమయంలో తెలుగులో వార్తలు వస్తున్నాయి. సుజాతకి వార్తలంటే విసుగు అయినా మధ్యాహ్నం పూట ఆ సమయంలో అంతకంటే ఫినతగ్గ ప్రోగ్రామ్స్ ఏవీ వుండవు. రేడియో పెట్టిన సుజాత దిండు ఒళ్ళో వేసుకుని దానిమీద చేతులు ఆన్చుకుని మంచం మీద వెనక్కు వాలి మళ్ళీ తల తిప్పి కిటికీలోంచి బయటకు చూడసాగింది. హేస్టన్ ఈపాటికి ఏం చేస్తుంటాడో. రేడియోలో వార్తలు వినిపిస్తున్నాయి.

"ఈ పూట వార్తలు ముగించే ముందు విశేషాలు మరొక్కసారి. నిన్న మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరిన విమానం ఒకటి సముద్రంలో కూలిపోయింది. ఇందులో మరో యిరవయిమంది ప్రయాణీకులతో పాటు ఈమధ్యనే ఆరువారాల పాటు ఇండియా పర్యటించడానికి వచ్చిన ప్రఖ్యాత చిత్రకారుడు, న్యూయార్కు ఫైన్ ఆర్ట్సు అసోసియేషన్ ఛైర్‌మెన్..." సుజాత ఒళ్ళో వున్న దిండుని ప్రక్కకి విసిరేసి ఒక్కంగలో మంచం మీద నుంచి ఉరికి రేడియో ఫుల్ వాల్యూమ్ రైజ్ చేసింది.

"శ్రీ హేస్టన్ ఉన్నారు. అనుకోకుండా కలిగిన వారి మరణానికి ప్రభుత్వం, భారత ప్రజలు తీరని విచారాన్ని తెలియజేస్తున్నారు" పెద్దగా అరుస్తున్న రేడియోమధ్య సుజాత కెవ్వుమంటూ క్రిందపడింది. ❑